


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## కొత్త డీజీపీగా హరీష్‌కుమార్ గుప్తా

2



వాట్సాప్ గవర్నెన్స్‌పై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షా సమావేశం

# ఇక.. వాట్సాప్ గవర్నెన్స్

- నేడు శ్రీకారం చుట్టనున్న విద్యామంత్రి లోకేష్
- మొదటి దశలో పౌరులకు 161 సేవలు
- సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- సైబర్ సెక్యూరిటీపై కీలక సూచనలు

2



పాలనకు సాంకేతికతను అనుసంధానిస్తూ ఏపీ సర్కారు నేడు చారిత్రక అడుగు వేయబోతోంది. దేశంలోనే తొలిసారిగా.... ఏపీ సర్కారు పౌరసేవలు అందించేందుకు, ప్రజా వినతుల స్వీకరణకు, అవసరమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు -వాట్సప్ గవర్నెన్సుకు శ్రీకారం చుట్టింది. నేటినుంచి ఆధునిక ఈ-సేవ అందుబాటులోకి రానుంది. వాట్సాప్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సమీక్ష నిర్వహించి.. మొదటిదఫాగా 161 సేవలు అందుబాటులో తెస్తున్నట్టు ప్రకటించారు. ఇందులో భాగంగా అధికారిక వాట్సాప్ నెంబర్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. ఆ అకౌంట్‌కు వెరిఫైడ్ ట్యాగ్ (టిక్ మార్క్) ఉంటుంది. భవిష్యత్తులో ఈ సేవను మరింత విస్తృతం చేయనున్నారు. ఐటీ, విద్యా మంత్రి నారా లోకేష్ గురువారం అధికారికంగా వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభిస్తారు.



# ఏటికొప్పాక బొమ్మలకు జేజేలు

5

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మల కొలువు ఇతివృత్తంతో ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శకటానికి మూడోస్థానం రావడం సంతోషకరం. రాష్ట్ర ప్రజలకు గర్వకారణం. కేంద్ర రక్షణ శాఖ ప్రకటించిన ఉత్తమ శకటాల జాబితాలో తొలి స్థానంలో ఉత్తరప్రదేశ్ శకటం, రెండో స్థానంలో త్రిపుర శకటం ఉండగా మూడోస్థానం ఏపీకి దక్కింది. ఈ సందర్భంగా శకటం రూపకర్తలకు రాష్ట్ర అధికారులకు... ప్రత్యేకించి ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసే కళాకారులకు అభినందనలు.

-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



4

# పంచగ్రామాల సమస్యకు పరిష్కారం


- సీఎం చొరవతో కొలిక్కివచ్చిందన్న మంత్రి అనగాని



6

# వైసీపీ భూదందాలపై బాధితుల గగ్గోలు

- సమస్యను పరిష్కరించాలంటూ గ్రీవెన్స్‌లో అర్జీలు



## భళా.. ఇస్రో!

ఇస్రో చరిత్రాత్మక నూరవ ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని షార్‌నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను సక్సెస్‌ఫుల్‌గా ప్రయోగించింది. ఈ రాకెట్.. ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని తీసుకొని నింగిలోకి దూసుకెళ్లి కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఎన్వీఎస్-02 ఉపగ్రహం.. ఇస్రో సైంటిస్టులు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. భౌగోళిక, వైమానిక, సముద్ర నావిగేషన్‌కు ఇది సేవలు అందించనుంది. అద్వితీయ ప్రయోగాన్ని విజయవంతం చేసిన సందర్భంలో ఇస్రో శాస్త్రవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు.

16



2

## జగన్‌రెడ్డి విధ్వంసానికి..

# అసర్ నివేదిక నిదర్శనం

- విద్యా ప్రమాణాలు గాడిన పెట్టేందుకు ప్రాథమిక సమస్యలపై దృష్టి
- మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపై అభిప్రాయసేకరణ
- పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దుర్ఘటనలో క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ.. మృతుల కుటుంబీకులకు ధైర్యం, ఓదార్పు చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ.. ఎక్స్ వేదికపై పోస్టు చేశారు.



# మహా.. విషాదం

- కుంభమేళాలో తొక్కిసలాట
- 30మంది భక్తులు మృత్యువాత
- 60మందికి గాయాలు
- దుర్ఘటనపై పీఎం మోదీ ఆరా
- బారికేడ్ల తొలగింపువల్లే: డీజీపీ
- మృతుల కుటుంబాలకు భారీ పరిహారం

16



# నేటి నుంచే వాట్సాప్ గవర్నెన్స్

- మొదటి దశలో పౌరులకు 161 సేవలు
- సైబర్ సెక్యూరిటీపై కీలక సూచనలు
- సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్యరథం): వాట్సాప్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రభుత్వం గురువారం నుంచి అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో సీఎం సమీక్షించారు. మొదటి విడతగా పౌరులకు 161 సేవలను ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. వాట్సాప్ ద్వారా సేవలను పొందాలనుకునే వారు ఏ విధంగా ఆప్షన్‌లను ఎంచుకుంటారనే దానిపై సీఎంకు అధికారులు వివరించారు. రెండో విడతలో మరిన్ని సేవలను ప్రభుత్వం అందు బాటులోకి తీసుకువస్తుంది. మొదటివిడతలో భాగంగా దేవాదాయ, ఎనర్జీ, ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ వంటి వివిధ శాఖల్లో సుమారు 161 సేవలను ప్రవేశపెట్టనుంది. దేశంలోనే మొదటిసారి వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నామని, ధృవపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి ఇక స్వస్తి పలకనున్నామని ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. అదేవిధంగా పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా జాగ్ర త్తలు తీసుకోవాల్సి ఉందని, ఆ దిశగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని సూచించారు. వాట్సాప్ ద్వారా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబర్ 22న మెటాతో ఒప్పందం చేసు కుంది. ఏపీని డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న తరుణంలో పాలన, ప్రభుత్వ సేవలను పౌరులకు వేగవంతంగా అందజేయడానికి ఈ విధానం సులభతరం కానుంది. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సమీక్షలో సీఎస్ కె.విజయానంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన కొత్త డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

## ఏపీ డీజీపీగా గుప్తా

### ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా హరీష్ కుమార్ గుప్తాకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 31న ప్రస్తుత డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పదవీవిరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో హరీష్ కుమార్ గుప్తాను తదుపరి డీజీపీగా నియమించారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో హరీష్ గుప్తాను ఎన్నికల సంఘం డీజీపీగా నియమించింది. దీంతో కొన్నిరోజుల పాటు ఆయన ఆ పోస్టులో కొనసాగారు. కూటమి అధికారంలోకి వచ్చాక ద్వారకా తిరుమలరావును డీజీపీగా నియమించింది. ఫిబ్రవరి 1నుంచి ఏడాదిపాటు ఆయన ఆర్టీసీ ఎండీగా కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ప్రసాదం పంపిణీపై భక్తుల ఫిర్యాదు

*- విచారణకు ఆదేశించిన మంత్రి లోకేష్*

శ్రీకాళహస్తి (చైతన్య రథం): శ్రీకాళహస్తి దేవాలయంలో క్యూలైన్లలోని భక్తులకు ప్రసాదం ఇవ్వకుండా బయటకు పంపించారన్న ఫిర్యాదుపై మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. 'ఎక్స్ ' వేదికగా భక్తులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన లోకేశ్.. తక్షణ విచారణకు ఆదేశించారు. ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఏ చర్యనూ ఉపేక్షించేది లేదన్నారు. కొంతమంది సిబ్బంది ఇప్పటికీ వైకాపా ప్రభుత్వంలోని విధానాల నుంచి బయటకు రాలేదని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జగన్‌రెడ్డి విధ్వంసానికి అసర్ నివేదికే నిదర్శనం

- విద్యా ప్రమాణాలు గాడిన పెట్టేందుకు ప్రాథమిక సమస్యలపై దృష్టి
- మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపై అభిప్రాయసేకరణ
- పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ



ఉండవల్లి (చైతన్యరథం): జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో విద్యాప్రమాణాలు దారుణంగా దిగజారాయనడానికి జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికే నిదర్శమని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. పాఠశాల విద్యపై ఉండవల్లిలోని నివాసంలో సమీక్ష నిర్వహించిన మంత్రి.. అసర్ నివేదికపై ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు గాడిన పెట్టేందుకు ఫ్యాన్సీ కార్యక్రమాలు కాకుండా ప్రాథమిక సమస్యలైన ఫౌండేషన్, లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి కనీస అభ్యాసన సామర్థ్యాల మదింపునకు తరగతి ఉపాధ్యాయులతో చర్చించాలని, వెనుకబడిన విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా కార్యక్రమాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించే అంశాన్ని పరిశీలించాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపైనా సమావేశంలో చర్చించారు. ఐవీఆర్ఎస్ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించాలని ఆదేశించారు. బాలికల స్వీయరక్షణ తర్ఫీదు కోసం శిక్షకులను నియమించాలని ఆదేశించారు. విద్యారంగంలో కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగంపైనా సమావేశంలో చర్చించారు. ప్రతి పాఠశాలలోని లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగపర్చుకునేలా ఉండవలసిన పుస్తకాలను ఆయా రంగాల నిపుణులతో చర్చించి పాఠశాల లైబ్రరీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు వినియోగించుకునే తీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులు, పీఈటీల అభీష్టం మేరకు పాఠశాలల్లో క్రీడా సామాగ్రిని సమకూర్చాలని, పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల ప్రభావాన్ని విశ్లేషించాలన్నారు. టెన్త్, ఇంటర్ లేదా తత్సమాన కోర్సుల్లో విద్యార్థుల డ్రాపవుట్స్ పైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యా విధ్వంసం బట్టబయలైంది..**

'ప్రచారానికి మేనమామ.. వాస్తవంలో కంసమామ' అని జగన్ భ్రష్టపాలన అసర్ నివేదికతో మరోసారి రుజువైందని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు చేశారే తప్ప విద్యా ప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదన్నారు. 2018లో నాటి టీడీపీ హయాంలో మెరుగ్గావున్న ప్రభుత్వ విద్యా ప్రమాణాలు వైసీపీ పాలనలో ఎలా దిగజారాయో అసర్ నివేదిక కళ్లకు కట్టిందన్నారు. అడ్డగోలు జీవోలు తెచ్చి ప్రభుత్వ పాఠశాలల మూసివేత, అక్షరాలు, అంకెలు గుర్తుపట్టలేని స్థితిలో విద్యార్థులు.. తగ్గిన హాజరు శాతం, తాగునీరు, మరుగుదొడ్లులాంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం.. ఇలా అనేక అంశాలు గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ఎండగడుతున్నాయన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో దాదాపు సగంమంది రెండో తరగతి పాఠ్య పుస్తకాలు చదవలేని పరిస్థితిని గణాంకాలు సహా అసర్ నివేదిక తేటతెల్లం చేసిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను గాడిన పెట్టి.. విద్యా ప్రమాణాల పెంపునకు గత ఏడు నెలల్లో గణనీయమైన చర్యలు తీసుకున్నామని మంత్రి లోకేష్ పునరుద్ఘాటించార. నిరంతరం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలు తెలుసుకుంటూ అనేక మార్పులకు కూటమి ప్రభుత్వం నాంది పలికిందన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారన్న పక్కా లెక్కలు తీయడం దగ్గర మొదలుపెట్టి.. మారుతున్న కాలానికి తగ్గట్టుగా పాఠ్యప్రణాళిక సిద్ధం చేయడం, విలువలతో కూడిన విద్య, విద్యార్థులను క్రీడలతో సహా ఇతర రంగాల్లో ప్రోత్సహించేలా గైడెన్స్ ఇవ్వడం, కనీస మౌలికవసతులు కల్పించడం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం వరకూ అనేక అంశాలపై దృష్టి పెట్టి పనిచేస్తున్నట్టు లోకేష్ వెల్లడించారు. త్వరలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేలా 'ఆంధ్రప్రదేశ్ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్' రూపొందించి.. ప్రజలు, విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకోనున్నట్టు ఐటీ, విద్యామంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

# రూ.10 లక్షల కోట్ల అప్పు!

- ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ భారం
- లక్షా 40 వేల కోట్లు బకాయిల చెల్లింపు భారం
- జగన్‌రెడ్డి విధ్వంసంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళా

*గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. జగన్‌రెడ్డి చేసిన ఆర్థిక విధ్వంసం కారణంగా రాష్ట్రానికి అప్పులు కూడా పుట్టని దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం చేసిన రూ.10 లక్షల కోట్ల పైనే అప్పులకు ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలి. ఇదే చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారింది.*



## జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలు కొన్ని...

| | | | |
|---|---|---|---|
| 1) | డిగ్రీ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు | - | రూ.2,832 కోట్లు |
| | ఇతర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు | - | రూ.450 కోట్లు |
| | చిక్కిలు, కోడిగుడ్లు | - | రూ.256 కోట్లు |
| | వసతి దీవెన | - | రూ. 989 కోట్లు |
| 2) | ఆరోగ్యశ్రీ బకాయిలు | - | రూ.1800 కోట్లు |
| 3) | ధాన్యం బకాయిలు | - | రూ.1600 కోట్లు |
| 4) | ఉద్యోగులకు బకాయిలు | - | రూ.20,000 కోట్లు |
| 5) | ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు | - | రూ.19,000 కోట్లు |
| 6) | గృహ నిర్మాణ బకాయిలు | - | రూ.7,800 కోట్లు |
| 7) | ఉపాధి హామీ బకాయిలు | - | రూ.2,100 కోట్లు |

- **ఇలా మొత్తం జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.1.40 లక్షల కోట్లు ఉన్నాయి. ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదు.**

## జగన్ విలాసాలు, జల్సాలకు ప్రభుత్వ ధనం దుబారా రూ.19,871.35 కోట్లు

| | |
|---|---|
| సెంటు పట్టాల పేరుతో దోపిడీ | రూ.7,000 కోట్లు |
| రేషన్ బియ్యంలో దోపిడీ | రూ.7,000 కోట్లు |
| సచివాలయాలకు వైసీపీ రంగులు వేసేందుకు, ఆ రంగులను తొలగించేందుకు ఖర్చు | రూ.3,000 కోట్లు |
| తాడేపల్లి ప్యాలెస్ వద్ద 986 మంది సెక్యూరిటీ ఖర్చు | రూ.1,000కోట్లు |
| సర్వే రాళ్ల మీద జగన్ ఫొటోలకు ఖర్చు | రూ.700 కోట్లు |
| రుషికొండపై విలాసవంతమైన భవన నిర్మాణం | రూ.600 కోట్లు |
| ప్రకటనల పేరుతో సాక్షికి దోచిపెట్టిన మొత్తం | రూ.500 కోట్లు |
| తాడేపల్లి ప్యాలెస్ నిర్వహణకు ప్రజాధనం ఖర్చు | రూ.15.25 కోట్లు |
| పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటోలకు | రూ.13 కోట్లు |
| తాడేపల్లి ప్యాలెస్ ఐరన్ ఫెన్సింగ్‌కు ప్రజాధనం ఖర్చు | రూ.12.85 కోట్లు |
| ప్యాలెస్ ప్రహరీ నిర్మాణానికి ప్రజాధనం ఖర్చు | రూ.10 కోట్లు |
| తాడేపల్లి ప్యాలెస్‌లో పెన్ను, పేపర్ల ఖర్చు | రూ.9.84 కోట్లు |
| ప్యాలెస్ ముందు రోడ్డు నిర్మాణం కోసం ఖర్చు | రూ.5 కోట్లు |
| జగన్ జమానాలో ఎగ్ పఫ్‌లు తినడానికి అయిన ఖర్చు | రూ.3.6 కోట్లు |
| మద్యం షాపుల్లో ఎలుకలు పట్టడానికి అయిన ఖర్చు | రూ.1.36 కోట్లు |
| జగన్ ఫ్యామిలీతో పర్సనల్ టూర్ ఖర్చు | రూ.22.52 లక్షలు |
| ప్యాలెస్‌లో తాత్కాలిక పనుల ఖర్చు | రూ.22.50 లక్షలు |
| **మొత్తం** | **రూ.19,871.35 కోట్లు** |

- **తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం వంటి వాటికి వినియోగించకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి తినేశారు.**



గురుజాల మాల్యాద్రి,
చైర్మన్ టీడీపీ నాలెడ్జ్ సెంటర్

## జగన్‌రెడ్డి కుటుంబ లూటీ రూ.8 లక్షల కోట్లు

ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్‌రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్‌కు అనుమతులు..ఇలా ప్రతి దాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారు. ఆంధ్రప్రదేశ్ గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టాడు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం చూపారు. చివరికి చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు వంటి వాటిల్లో కూడా పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడు.

| | | |
|---|---|---|
| 1. | లిక్కర్ కమీషన్ | రూ.1,05,000 కోట్లు |
| 2. | 22(ఎ), అసైన్డ్ భూముల కుంభకోణం | రూ.1,00,000 కోట్లు |
| 3. | ఇండోసోల్(జగన్ బినామీ) కుంభకోణం | రూ.75,000 కోట్లు |
| 4. | జీఐఎస్ విద్యుత్ ఒప్పందాల కుంభకోణం | రూ.50,000 కోట్లు |
| 5. | టీడీఆర్ బాండ్ల కుంభకోణం | రూ.50,000 కోట్లు |
| 6. | విశాఖ భూముల కుంభకోణం | రూ.40,000 కోట్లు |
| 7. | ఇసుక దోపిడీ | రూ.60,000 కోట్లు |
| 8. | ఎర్రచందనం కుంభకోణం | రూ.25,000 కోట్లు |
| 9. | గ్రావెల్ దోపిడీ | రూ.22,000 కోట్లు |
| 10. | సిలికా, బీచ్ శాండ్, క్వార్జ్ దోపిడీ | రూ.17,000 కోట్లు |
| 11. | గంజాయి, డ్రగ్స్ వాటా | రూ.37,000 కోట్లు |
| 12. | ప్రభుత్వ కొనుగోళ్లలో కమీషన్లు | రూ.16,000 కోట్లు |
| 13. | కూకట్‌పల్లిలో 11 ఎకరాలు, లేపాక్షి భూములు | రూ.15,000 కోట్లు |
| 14. | స్మార్ట్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు, తదితరాల్లో అవినీతి | రూ.15,000 కోట్లు |
| 15. | కోవిడ్ మందులు, కిట్ల కొనుగోళ్లలో | రూ.14,000 కోట్లు |
| 16. | భారతి సిమెంట్ దోపిడీ | రూ.12,000 కోట్లు |
| 17. | రేషన్‌బియ్యం కుంభకోణం | రూ.7,000 కోట్లు |
| 18. | ఇళ్ల స్థలాల కొనుగోలు కుంభకోణం | రూ.7,000 కోట్లు |
| 19. | బైజూస్, విద్యాకానుక, నాడు-నేడు | రూ.4,500 కోట్లు |
| 20. | పోర్టుల్లో అవినీతి | రూ.4,000 కోట్లు |
| 21. | సాగునీటి ప్రాజెక్టుల్లో కమీషన్లు | రూ.2,500 కోట్లు |
| 22. | సాక్షికి ప్రకటనల రూపంలో దోపిడీ | రూ.1,600 కోట్లు |
| 23. | అమూల్ కమీషన్ | రూ.1,000 కోట్లు |
| 24. | జే ట్యాక్స్ | రూ.40,000 కోట్లు |
| 25. | సీబీఐ చార్జిషీట్లో నిర్ధారించినవి | రూ.43,000 కోట్లు |
| 26. | సీబీఐ నిర్ధారించాల్సిన ఆస్తుల విలువ | రూ.60,000 కోట్లు |
| | **మొత్తం** | **రూ.8,23,600 కోట్లు** |

- **పై కారణాలన్నింటి వల్ల ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దివాళా తీసింది. ఇది నేటి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండగా తయారైంది. ప్రజలపాలిట శాపంగా మారింది.**





## మహా విషాదం

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుం భమేళాలో విషాద దృశ్యాలివి. మౌని అమావాస్య సందర్భంగా నెలకొన్న రద్దీతో తొక్కిస లాటలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. బ్యాగుల కుప్పలు..చెల్లాచెదురుగా పడిన భక్తుల దుస్తులు, బూట్లు ఘటన తీవ్రతకు అద్దం పడుతున్నాయి. మౌని అమా వాస్య నాడు గంగానదిలో ప్రత్యేకించి త్రివేణి సంగమంలో జలాలు అమృతంతో సమా నంగా భక్తులు భావిస్తారు. అక్కడ స్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యఫలం కలుతుందని నమ్మకం. అందుకే త్రివేణి సంగమం ప్రధాన ఘాట్ వద్ద స్నానమాచరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించగా అవి విరిగిపోయి తొక్కిసలాటకు దారితీసింది.





## సీఎం చంద్రబాబు చొరవతో

# పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

- 12,149 ఇళ్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయం
- 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచల దేవస్థానానికి ఇచ్చేందుకు సంసిద్ధం
- సీఎం అధ్యక్షతన సచివాలయంలో కీలక నిర్ణయాలు
- రెవిన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



అమరావతి, (చైతన్యరథం) : ఎంతో కాలం నుండి అపరిష్కృతంగా ఉన్న సింహాచలం పంచ గ్రామాల సమస్యకు త్వరలో ప్రభుత్వం పరిష్కారం చూపనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెవిన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ సమస్యకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు జరిగాయన్నారు. రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో విశాఖపట్నానికి చెందిన పలువురు శాసన సభ్యులతో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. పంచ గ్రామాల్లోని 12,149 ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రత్యామ్న యంగా దాదాపు రూ.5,300 కోట్ల విలువ చేసే 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచల దేవస్థానానికి ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి సింహచల దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కూడా ఆమోదం తెలిపారన్నారు. ఈ సమస్యకు సంబంధించి గతంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై పలువురు కోర్టుకు వెళ్ళారన్నారు. ప్రస్తుతం కోర్టులో ఉన్న ఆ కేసులను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీరించేందుకు జీ.ఓ.నెం. 338, 296 ఉత్తర్వులను జారీ చేశామన్నారు. ఈ జీవోల కింద విశాఖలో 70 వేల మంది క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ జీఓల ప్రకారం రెండేళ్ల కాల వ్యవధిలో ఆ భూములపై లబ్ధిదారులకు అన్ని హక్కులు సంప్రాప్తం అయ్యే విధంగా కన్వేయన్సు డీడ్ కూడా ఇవ్వాలని నిర్ణయం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం ఆ ఓలను పట్టించుకోకుండా లబ్ధిదారులకు న్యాయం చేసే విధంగా స్పందించ లేదన్నారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక శాసన సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు చేసిన విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. దానికనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గత జీఓ ప్రకారం ఈ భూములను క్రమబద్ధీకరించాలని, అప్పటి నుండి రెండేళ్ల కాలవ్యవధి పూర్తి అయిన వాటికి కన్వేయన్సు డీడ్లను కూడా జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదే విధంగా రైతులు సాగు చేసుకునే భూములు, కొన్ని ఖాళీ స్థలాలకు సంబంధించి కోర్టులో పలు కేసులు ఉన్నందున, వాటిని కూడా పరిష్కరించరించేందుకు దశల వారీగా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్(యుఎల్‌సీ)లోని అదనపు భూముల్లో ఆక్రమణకు గురైన వాటిని పీఓటీ చట్టం ప్రకారం పదేళ్ల కాల వ్యవధిలో కేటాయింపు చేయాల్సి ఉందని, అయితే అటు వంటి భూములకు కూడా రెండేళ్ల కాలవ్యవధిలోనే కన్వేయన్సు డీడ్లను ఇచ్చేందుకు ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. గాజువాక ఈనాం భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి తమ ప్రభుత్వం 2018లో జారీ చేసిన 301 జీఓ ప్రకారం దాదాపు 7 వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ ప్రక్రియ కూడా పూర్తి కాకుండా అపరిష్కృతంగా ఉందన్నారు. ఈ జీఓను కూడా సవరించి నూతన మార్గదర్శకాలతో మరో జీఓ జారీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

### ఈనాం భూముల క్రమబద్ధీకరణ

గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం భూమి సుమారు 420 ఎకరాలు ఆక్రమణకు గురై వాటిలో దాదాపు 12,149 ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. ఆ ఇళ్లను క్రమబద్ధీకరిం చేందుకు గతంలో తమ ప్రభుత్వం 229 జీఓ జారీ చేసిందన్నారు. 420 ఎకరాల ప్రభుత్వ భూమిని మరో చోట ఇచ్చేందుకు, క్రమబద్ధీకరణ కింద వచ్చే ఫీజును కూడా దేవస్థానానికి ఇచ్చేందుకు నిర్ణయం జరిగిందన్నారు. అయితే ఆక్రమణకు గురైన దేవస్థానం భూమి విలువకు తగిన భూమిని ఇవ్వాలని కోరుతూ కొంత మంది కోర్టుకు వెళ్ళారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం మేరకు 420 ఎకరాలకు బదులుగా 610 ఎకరాలు (సమాన రిజిస్ట్రేషన్ విలువతో) సింహాచలం దేవస్థానానికి బదలాయించాలని నిర్ణయం జరిగిందన్నారు. దీని రిజిస్ట్రేషన్ విలువ దాదాపు రూ.5,300 కోట్ల వరకూ ఉందన్నారు. పెదగంట్యాడ, గాజువాక, గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాల భూమి ఇస్తున్నామన్నారు. దేవస్థానానికి అవసరమైన చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం ఉన్న చోట భూమి ఇస్తున్నామన్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కోర్టులో కౌంటరు ఫైల్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రెండు మూడు మాసాల్లో ఈ సమస్యకు ఒక పరిష్కార మార్గం దొరుకుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. గాజువాకలో ఈనాం భూమిని క్రమబద్ధీకరించేందుకు కూడా నిర్ణయం ఓజరిగిందన్నారు. ఈ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి 2015-16 సంవత్సరంలో 301 జీఓ జారీ అయ్యిందన్నారు. దాని గడువు ముగిసిందన్నారు.దానిని పొడిగిస్తూ మరో జీఓ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనివల్ల మరో ఆరు వేల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

సమావేశంలో విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) మాట్లాడుతూ సింహాచలం భూముల క్రమబద్ధీకరణ విషయంలో 1998లో తమ ప్రభుత్వ హయాంలోనే 578జీఓ జారీ అయ్యిందన్నారు. దానికి అనుగుణంగా చాలా మంది క్రమబద్ధీకరణ చేసుకున్నారన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. తిరిగి 2014-19 కాలంలో తమ ప్రభుత్వమే 229 జీఓ జారీ చేసి సింహాచల భూముల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల కోర్టులోని కేసు కూడా పరిష్కారం అవుతుందన్నారు. దాదాపు 70 శాతం మందికి న్యాయం చేకూరుతుందన్నారు. అదేవిధంగా భూముల క్రమబద్ధీకరణకు గతంలో తమ ప్రభుత్వం జారీ చేసిన 296, 388 జీఓలను విశాఖపట్నం వాసులే ఎక్కువగా వినియోగించుకున్నారన్నారు.సమావేశంలో విశాఖపట్నం ఎంపీ ఎం శ్రీభరత్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్.. నాకు మహా ఇష్టం

- విద్యాశాఖా మంత్రిగా వినూత్న పథకాలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- అందుకే నా సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ
- విజయవాడ, తిరువూరు డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలకు అందజేత
- కేబీఎన్ కాలేజీలో స్పోర్ట్స్ కిట్ల సరఫరా

విజయవాడ, (చైతన్యరథం): విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆ శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం మే నుంచి తల్లికి వందనం పథకం అమలు చేయనుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలోని 147 ప్రభుత్వ పాఠశాలలకు తన సొంత నిధులతో 8 క్రీడలకు సంబంధించిన క్రీడావస్తువులతో క్రీడా వికాసం పేరుతో స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్నారు. ఈ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం రోజున ప్రారంభించి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలకు క్రీడావికాసం స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. బుధవారం కేబీఎన్ కళాశాలలో విజయవాడ తూర్పు, విజయవాడ సెంట్రల్, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని 67 ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా వికాసం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. తూర్పు నియోజకవర్గంలో 5, సెంట్రల్ నియోజకవర్గంలో 10, తిరువూరులో 27, మైలవరంలో 25 ప్రభుత్వం పాఠశాలలకు ఎంపీ కేశినేని శివనాథ్ క్రీడా వికాసం స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలకు తన సొంత నిధులతో అందించిన ఈ స్పోర్ట్స్ కిట్లలో వాలీబాల్ నెట్స్, వాలీబాల్స్, త్రో బాల్ నెట్స్, త్రో బాల్స్, టెన్నీకాయిట్ నెట్స్, టెన్నీకాయిట్స్, హ్యాండ్ బాల్స్, షటిల్ నెట్స్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ బోర్డ్ అండ్ కాయిన్స్, ఖో-ఖో పోల్స్, బాల్ బ్యాడ్మింటన్ కిట్, హై జంప్ స్టాండ్స్, టేక్ ఆఫ్ బోర్డ్ వున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రౌండ్స్ అధ్వాన్నంగా తయారై విద్యార్థులు ఆటలకు దూరమైపోయారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుల్లోనే కాదు..ఆటల్లో కూడా బాగా రాణించాలని ఆకాంక్షించారు. అందుకే తన సొంత నిధులతో జిల్లాలోని 147 ప్రభుత్వ పాఠశాలల్లో గ్రౌండ్స్ అభివృద్ధి చేయించి లాంగ్ జంప్ పిట్స్ సిద్ద చేయించానన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన క్రీడా వస్తువులను కూడా జిల్లాలోని 147 ప్రభుత్వ పాఠశాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం త్వరలో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ఉంటుందన్నారు. తనకిష్టమైన నాయకుల్లో మంత్రి నారా లోకేష్ ఒకరన్నారు. ఆయన విద్య శాఖ మంత్రిగా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా తయారు



చేసేందుకు మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ ఒక పండుగలా నిర్వహించారని గుర్తు చేశారు. ఇక కాలేజీ విద్యార్థులు ఇబ్బంది పడకుండా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఉండాలని అదే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ప్రకటించి అందుకోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని, అందుకే మంత్రి నారా లోకేష్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో రెండు క్రీడా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వికసిత్ ఏపీ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర దిశగా తీసుకువెళుతున్నారని కొనియాడారు. వీరి స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్ తన సొంత నిధులతో పంపిణీ చేయటం చాలా సంతోషంగా వుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా స్పోర్ట్స్ మీట్ నిర్వహించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సంపాదించటానికి సమ్మర్ క్యాంప్స్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సమస్యలుంటే తన దృష్టి తీసుకురావాలన్నారు. అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేం దుకు ప్రభుత్వ పాఠశాలల మైదానాలు అభివృద్ధి చేయటంతో పాటు స్పోర్ట్స్ కిట్లు అందించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. రెండు నెలల క్రితం కేబీఎన్ కాలేజీలో జరిగిన డిస్ట్రిక్ట్ పీడీ రివ్యూ మీటింగ్‌లో చెప్పిన విధంగా జిల్లా వ్యాప్తంగా వున్న ప్రభుత్వ పాఠశాలల మైదానాలు బాగు చేయించి, పాఠశాలలకు అవసరమైన స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేయటం చాలా గొప్ప విషయమని, ప్రభుత్వ నిధులతో కాకుండా సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టే నాయకులు అరుదుగా వుంటారని, ఆ వరుసలో ఎంపి కేశినేని శివనాథ్ ముందు వుంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేపీవీవీ గ్రూప్ ఇన్స్టిట్యూట్స్ ఏవో డాక్టర్ వి నారాయణ రావు, కేబీఎన్ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ టి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎమ్ఎస్ బేగ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్ పాల్గొన్నారు.



ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మల కొలువు ఇతివృత్తంతో ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శకటానికి మూడోస్థానం రావడం సంతోషకరం. రాష్ట్ర ప్రజలకు గర్వకారణం. కేంద్ర రక్షణ శాఖ ప్రకటించిన ఉత్తమ శకటాల జాబితాలో తొలి స్థానంలో ఉత్తరప్రదేశ్ శకటం, రెండో స్థానంలో త్రిపుర శకటం ఉండగా మూడోస్థానం ఏపీకి దక్కింది. ఈ సందర్భంగా శకటం రూపకర్తలకు రాష్ట్ర అధికారులకు... ప్రత్యేకించి ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసే కళాకారులకు అభినందనలు

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

# ఏటికొప్పాక బొమ్మలకు జేజేలు

- ❑ ఏపీ శకటానికి జాతీయ పురస్కారం
- ❑ ముప్పై ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు బహుమతి
- ❑ రిపబ్లిక్‌డే పెరేడ్‌లో యావద్దేశాన్ని ఆకట్టుకున్న ఏపీ శకటం
- ❑ కొలువు తీరిన బొమ్మల దర్పానికి నెటిజన్ల ఫిదా
- ❑ జ్యూరీ అవార్డు ప్రకటించిన కేంద్రం
- ❑ సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి, (చైతన్యరథం) : దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవం పెరేడ్‌లో భాగంగా ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ అవార్డు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని చేతి వృత్తి కళలు, కళాకారుల ప్రాముఖ్యత చాటుతూ, సత్సాంప్రదాయ వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఏటి కొప్పాక బొమ్మలను కొలువు తీర్చి ప్రదర్శించిన శకటం గణతంత్ర ఉత్సవాల ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యావద్భారతావనిలో ప్రజలందరి దృష్టినీ కట్టిపడేసింది. సామాజిక మాధ్యమాలలో సైతం లక్షలాది మంది ఈ శకటం రాజసానికి మంత్రముగ్దులయ్యారు. ప్రశంసల వెల్లువతో ముంచెత్తారు. రాష్ట్రంలో చేతివృత్తులు, హస్తకళలకు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం తీసుకురావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ ఈ శకటాన్ని రూపొందించింది. శకటం ముందు వినాయకుడు, చివరిగా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు రూపాలతో, ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టూ బొట్టూ ప్రతిబింబించేలా అమర్చిన ఏటికొప్పాక బొమ్మల కొలువుతో శకటం ఆధ్యంతం నయనానంద భరితమై ఆకట్టుకుంది. శకటం కదులుతున్నంత సేపు ఏటి కొప్పాక బొమ్మల ప్రాశస్త్యాన్ని చాటుతూ బొమ్మలు.. బొమ్మలు.. ఏటికొప్పాక బొమ్మలు, ఆంధ్రప్రదేశ్ బొమ్మలు, విద్యను నేర్పే బొమ్మలివి, వినోదభరితమైన బొమ్మలు, భక్తిని చాటే బొమ్మలు, హస్తకళల హంగులు, సహజ ప్రకృతి రంగులు" అంటూ సాగే గీతం జన హృదయాలను రంజింపజేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు సైతం ఈ శకటం ముగ్దమనోహర ముస్తాబును చూసి పులకించిపోయారు. నెటిజన్లు సైతం ఏపీ ప్రదర్శించిన ఏటి కొప్పాక బొమ్మల శకటాన్ని పెద్ద ఎత్తున సామాజిక మధ్యమాల్లో షేర్ చేసుకున్నారు. చాలా మంది తమ సామాజిక మాధ్యమ చరవాణుల్లో డీపీలుగా కూడా ఈ శకటాన్ని ప్రదర్శించారు. ఓటింగ్‌లో ఏటికొప్పాక శకటానికి పెద్ద ఎత్తున జేజేలు పలికారు.

### మూడు దశాబ్దాల తర్వాత జ్యూరీ అవార్డు

దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో ప్రదర్శించే శకటాలకు సంబంధించి 30 సంవత్సరాల సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ శకటానికి కేంద్ర ప్రభుత్వ జ్యూరీ పురస్కారం లభించింది. ఏటికొప్పాక బొమ్మలు కొలువు తీరిన శకటం తృతీయ బహుమతి అందుకుంది.

### సీఎం, డిప్యూటీ సీఎం ప్రశంసలు

చూడ ముచ్చటగా ముస్తాబయిన ఏటికొప్పాక శకటాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్‌లు సైతంమెచ్చుకున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఇద్దరూ తమ సామాజిక మధ్యమల వేదికగా ఈ శకటాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. ఏటి కొప్పాక బొమ్మలకు జియో ట్యాగింగ్ చేసి, ఈ బొమ్మలను అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

## ఏటికొప్పాక కళకు మరింత ఊతం

**- బీసీ సంక్షేమం, చేనేత జౌళి మంత్రి సవిత**



అమరావతి (చైతన్య రథం): 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటం తృతీయస్థానంలో నిలవడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్ సవిత హర్షం వ్యక్తంచేశారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయలను చాటిచెప్పేలా రూపొందించిన ఏటికొప్పాక బొమ్మల శకటం దేశ ప్రజలతోపాటు ప్రధాని నరేంద్రమోదీని సైతం ఆకట్టుకుందన్నారు. ఈమేరకు బుధవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ హస్తకళాకారుల ప్రతిభ మరోసారి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. సహజ సిద్ధమైన వనరులతో పర్యావరణహితంగా ఏటికొప్పాక బొమ్మలను తయారు చేస్తుంటారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికే హస్త కళలకు ప్రాధాన్యమిస్తోందన్నారు. రాష్ట్రంలో హస్త కళాకారులకు ఆర్థిక చేయూతనందిస్తూ, పలు ఎగ్జిబిషన్లు నిర్వహిస్తోందన్నారు. చేనేత వస్త్రాలతో కలిపి హస్తకళల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తోందన్నారు. ఏటికొప్పాక బొమ్మల శకటం దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందడంతో ఆ కళకు మరింత ఊతం లభించే అవకాశముందన్నారు. ఏటికొప్పాక బొమ్మల శకటం రూపొదించి, ఢిల్లీ పేరెడ్‌లో ప్రదర్శించిన బృందానికి మంత్రి సవిత అభినందనలు తెలిపారు.

## సాంస్కృతిక వారసత్వ ప్రతీకలు ఏటికొప్పాక బొమ్మలు

**- జాతీయ పురస్కారంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం**

**- రూపకర్తల బృందానికి అభినందనలు**



అమరావతి, (చైతన్యరథం) : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటం మూడవ స్థానంలో నిలవడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. అధ్యాత్మిక భావనతో పాటు రాష్ట్ర సంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా తీర్చిదిద్దిన శకటం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ప్రజల మనసును దోచుకోవడం సంతోషానిచ్చిందన్నారు. శకటం ముందు పర్యావరణ హితంగా, సహజసిద్ధమైన వనరులతో సృజనాత్మకంగా తయారు చేసిన వినాయకుడు, చివర ఎత్తైన శ్రీ వేంకటేశ్వరస్వామి రూపాలు, ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టును ప్రతిబింబించేలా బొమ్మల కొలువు, శకటం ప్రాధాన్యతను వివరిస్తూ కళాకారులు, చిన్నారుల నాట్యం పలువురిని ఆకట్టుకోవడంతో 3వ స్థానంలో నిలిచామని వివరించారు. కూటమి ప్రభుత్వం హస్తకళలకు ప్రాధాన్యతనిస్తోందని, విస్తృతంగా ప్రచారం కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఏటికొప్పాక బొమ్మల శకటాన్ని ముస్తాబు చేసి హస్తిన వేదికపై ప్రదర్శించిన జేజేలందుకున్న రూపకర్తల బృందాన్ని మెచ్చుకున్నారు. అదేవిధంగా తొలి స్థానంలో నిలిచిన యూపీ మహాకుంభ్ శకటం, రెండో స్థానంలో త్రిపుర రాష్ట్ర శకటం శిల్పులను అభినందనలు తెలిపారు.

# వైసీపీ భూదందాపై ఫిర్యాదులు

## అన్యాక్రాంతమైన భూములు ఇప్పించాలంటూ బాధితుల ఫిర్యాదు

- 22ఏ నుంచి తమ భూములు తొలగించాలని అర్జీలు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న నాయకులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి గొట్టిపాటి, అశోక్‌బాబు, దీపక్‌రెడ్డి







అమరావతి (చైతన్య రథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్దేశపూర్వకంగా భూముల్ని 22ఏ జాబితాలో చేర్చడం, అధికారం అడ్డంపెట్టుకుని భూములను కబ్జా చేయడంపై బాధితులు బుధవారంనాటి గ్రీవెన్స్‌లో అర్జీలు సమర్పించారు. సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ప్రజాప్రతినిధులకు విన్నవించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్సీ అశోక్ బాబు, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డిలు వినతులు స్వీకరించారు.

సత్యసాయి జిల్లా అమడగూరు మండలం జౌకుల కొత్తపల్లి గ్రామానికి చెందిన కె రెడ్డప్ప అర్జీని ఇస్తూ.. తాము కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని వైసీపీ నేతల ప్రోద్బలంతో 22ఏ జాబితాలో పడేశారని.. తమ భూమిని 22ఏ నుంచి తొలగించాలని వేడుకున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన గోపి కృష్ణ అర్జీని సమర్పిస్తూ.. నూజివీడు గ్రామంలో తమ తండ్రి కొనుగోలు చేసిన భూమిని జగనన్న ఇళ్లకోసమని తీసుకొని 22ఏలో పెట్టారని.. దాన్ని తొలగించి తమ భూమిని అప్పగించాలని నేతలకు విజ్ఞప్తి చేశారు. ఉరుటి బానూజిరావు, కూనిశెట్టి భాస్కర్ రావు, కూనిశెట్టి మోహన్ రావు, కనకల వెంకటరావులు ప్రభుత్వ పోరంబోకు వాగును ఆక్రమించారని దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విజయనగరం జిల్లా రామభద్రపు మండలం ఆరికతోట గ్రామానికి చెందిన పి రాధాకృష్ణ నేడు గ్రీవెన్స్‌లో అర్జీ సమర్పించి.. చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన తుమ్మల వెంకటేశ్వరరావు అర్జీని సమర్పిస్తూ. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దనున్న పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. దీనిపై విచారించి తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలానికి చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శన నాయుడు నేతలకు విజ్ఞప్తి చేస్తూ.. గండికోట నుండి పుట్లూరు వయా సుబ్బరాయసాగర్ ఎత్తిపోతల పథకం ఆర్థిక శాఖ క్లియరెన్స్‌లో ఉన్నదని.. ఈ పథకం పూర్తయితే దాదాపు 35వేల ఎకరాలకు సాగునీరు రెండు మండలాల్లోని గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని.. త్వరగా నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలానికి చెందిన యేదల శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. తాను గుంటూరులోని మలబార్ సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ వద్ద నగదు చెల్లించి కొనుగోలు చేసిన విత్తనాలు నకిలీవని తెలిసి తిరిగి విత్తనాలను వెనక్కిపంపిస్తే.. చెల్లించిన నగదుకు రెండు చెక్కులిచ్చి డబ్బులు తీసుకోమని చెప్పారని.. బ్యాంకులో వేస్తే చెక్కులు బౌన్స్ అయ్యాయని.. మలబార్ సీడ్స్‌ను డబ్బులు అడిగితే ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని.. వారిపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాలని గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన దొడ్డా శేషాద్రి గ్రీవెన్స్‌లో నేతలకు విజ్ఞప్తి చేస్తూ.. తమ ఊరి చెరువుకు వర్షపు నీరు వచ్చే నల్ల వాగు కలువకంటే వెలుగొండ కాలువ బ్రిడ్జీని ఎత్తులో కట్టడం వలన చెరువులోకి రావాల్సిన నీరు వృథాగా పోతుందని.. దాంతో చెరువులోకి నీరురాక గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. దయచేసి చెరువులోకి నీరు వచ్చేలా అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలానికి చెందిన కొండామర్రెపల్లి గ్రామానికి చెందిన రామచంద్ర విజ్ఞప్తి చేస్తూ.. తమకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని మరోకరు కబ్జా చేశారని, తమకు మంజూరు చేసిన భూమిని కబ్జా నుండి విడిపించాలాని వేడుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన వేముల శ్రీను విజ్ఞప్తి చేస్తూ.. తాను దివ్యాంగుడినని తనకు వస్తున్న పింఛన్‌ను గత ప్రభుత్వంలో కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తుందని తొలగించి తనకు అన్యాయం చేశారని.. తొలగించిన పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు. అర్జీలను పరిశీలించి సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నేతలు హామీ ఇచ్చారు.



















# వైసీపీకి బుద్ధి రాదా?

- జగన్ హయాంలో అభివృద్ధి ఊసే లేదు
- కూటమి పాలనపై విషం కక్కుతున్నారు..
- ప్రజాభీష్ట ప్రభుత్వంపై ఎందుకంత కక్ష
- సొంత మీడియా సాక్షిలో అన్నీ అసత్యాలే
- నిప్పులు చెరిగిన సాంఘిక సంక్షేమ మంత్రి డోలా
- చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షమని వ్యాఖ్య



అమరావతి (చైతన్య రథం): వైసీపీ హయాంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మంత్రి డోలా మాట్లాడుతూ... '2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చారు. ఒక అరాచక శక్తిని తరిమికొట్టారు. రాష్ట్ర ప్రజలపై వైసీపీ అరాచకాలు తట్టుకోలేకే ఎన్డీయే ప్రభుత్వానికి అవకాశమిచ్చారు. వైసీపీ హయాంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఐదేళ్ల అభివృద్ధి చేసి చూపించాం' అన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్‌ను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారని, వైసీపీ మాత్రం వెయ్యి రూపాయలు పింఛను పెంచుతామన్న హామీ అమలు చేయడానికి ఐదేళ్లు ఆపసోపాలు పడిందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం అప్పులు, బకాయిలే మిగిల్చినా.. రూ.4 వేలకు పెంచిన పింఛన్ పథకాన్ని అరియర్స్ సహా అందించి కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. దేశంలో ఏరాష్ట్రం ఇవ్వని విధంగా వికలాంగులకు 6వేలు, మంచానికే పరిమితమైనవారికి రూ.15వేలు పింఛను ఇస్తున్న ప్రభుత్వం ఒక్క కూటమి ప్రభుత్వమేనన్నారు. ఆడపడచుల కష్టాలు తీర్చడానికి దీపం పథకం-2 ద్వారా 3 ఉచిత గ్యాస్ కనెక్షన్లు 90 లక్షల కుటుంబాలకు ఇస్తుంటే.. చూసి ఓర్వలేని వైసీపీ నేతలు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమం అమలుకు అడ్డుతగులుతున్న వైసీపీని ప్రజలు తిప్పికొడుతున్నా బుద్ధి రావడం లేదని మంత్రి డోలా వ్యాఖ్యానించారు. అన్నా క్యాంటిన్లు ఎలా మూసేస్తారని అప్పట్లో అసెంబ్లీలో లేవదీస్తే.. నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని గుర్తు చేస్తూ.. చంద్రబాబు అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించారన్నారు. అదనంగా అన్న క్యాంటిన్‌ల ఏర్పాటుకు కేబినెట్‌లో నిర్ణయించారని, త్వరలోనే అమలవుతుందన్నారు. 'వైసీపీ నాయకులకు ఇవన్నీ కళ్లకు కనిపించవు, చెప్పినా వినిపించవు. మీ నాయకుడి మెప్పు కోసం ఏదేదో మాట్లాడుతున్నారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు మిమ్మల్ని వదిలేసి బయటికి వస్తున్నారు. వైసీపీ నాయకుడి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వైసీపీ నాయకులు చేసిన గుంతల రోడ్లను మేం పూడుస్తూ వస్తున్నాం. మీ గుంటల రోడ్లమీద పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నవారు మీ కళ్లకు కనిపించడంలేదా? 6 నెలల వార్తలను ఈరోజు జరిగినట్లుగా సాక్షి పత్రికలో వేసుకుంటారు. సాక్షిలో వచ్చేవన్నీ అసత్య ఆరోపణలే. సాక్షి మీడియా చూసేవారే అసహ్యించుకుంటున్నారు. అమ్మఒడి అని చెప్పి మొదటి ఏడాది ఇవ్వకుండా వదిలేశారు. ఐదేళ్లూ కంటిన్యూగా ఇవ్వలేదు. ఇద్దరు పిల్లలకు ఇస్తామని ఆశపెట్టి మాటతప్పి మోసం చేసింది గుర్తు లేదా?' అని నిలదీశారు. వైసీపీ ఇప్పటికీ వాస్తవ ప్రపంచంలో బతకడంలేదని ఎద్దేవా చేశారు.

వైసీపీ మాదిరిగా మాటిచ్చి మడమ తిప్పే ఆలోచన కూటమి ప్రభుత్వానికి ఉండదని, ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం అహరహం కృషి చేస్తుందని మంత్రి డోలా స్పష్టం చేశారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. పేదల కోసం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జగన్‌లా పరదాల మాటున దాక్కోవడం, చెట్లు కొట్టించేయడం, గాల్లో చక్కర్లు కొట్టడంలాంటివి చేయలేదు. ప్రజలకు జవాబుదారీగా ఉన్నాం. నిరుద్యోగాన్ని పారదోలుతామన్న వైసీపీ ఒక్క డిఎస్సీ కూడా వేయలేకపోయింది. మేం వచ్చి డిఎస్సీపై సంతకం చేశాం. త్వరలోనే విద్యా సంవత్సరం మొదట్లోనే 16 వేల మందికి ఉద్యోగాలకి టీచర్ పోస్టులు ఇవ్వబోతున్నాం' అని డోలా వివరించారు. పెట్టుబడులు తెచ్చి 9వేల ఉద్యోగాలిచ్చామని వైసీపీ చెప్పుకుంటోంది. మేము సుమారుగా ఏడు నెలల్లోనే 6 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు తీసుకొచ్చాం. 4 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. వైసీపీ మాదిరి కల్లబొల్లి మాటలు చెప్పడంలేదు. స్వయంగా ప్రధానే వచ్చి విశాఖపట్నంలో శంఖుస్థాపనలు చేశారు. రైల్వే జోన్ తీసుకొచ్చాం. రైల్వే జోన్ ఆఫీస్‌కు శంఖుస్థాపన చేశామని మంత్రి డోలా స్పష్టం చేశారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ పెట్టడానికి కేబినెట్‌లో తీర్మానం చేశామని, గౌడ కులస్థులకి మద్యం షాపుల్లో 10 శాతం రాయితీతో షాపులిస్తున్నామని, గంజాయిరహిత రాష్ట్రాన్ని ఆవిష్కరిస్తున్నామని, లా అండ్ ఆర్డర్‌ను పూర్తిగా కంట్రోల్‌లో పెట్టామన్నారు. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్టు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబు పెట్టింది పేరని అంటూ.. 2047 నాటికి ప్రతి కుటుంబం సాధికారత సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు.

సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు రూ.143 కోట్ల బడ్జెట్ ఇచ్చి మరమ్మతులు చేస్తున్నామని, కనీసం రూ.25 కోట్లు వైసీపీ ఇవ్వలేకపోయిందని డోలా ఆగ్రహం వ్యక్తం చేశారు. అసమర్థ పాలన సాగించిన వైసీపీ.. కూటమిపై బురదజల్లే ప్రయత్నాలు ఇకనైనా మానుకోవాలన్నారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ చేసిన పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి హెచ్చరించారు.

# విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించారు

- వైసీపీ అసమర్థ విధానాలకు 'అసర్' అక్షరసాక్ష్యం
- జగన్ ప్రగల్భాలే తప్ప.. ఫలితాలు శూన్యం
- వైసీపీ విధానాలపై సీడాప్ ఛైర్మన్ ఆగ్రహం
- కూటమి పాలనలోనే 'విద్య'కు ప్రాధాన్యమని వ్యాఖ్య



అమరావతి (చైతన్య రథం): వైసీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించిందని చెప్పడానికి కేంద్రం విడుదల చేసిన అసర్ నివేదికే సాక్ష్యమని సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దీపక్ రెడ్డి మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా దెబ్బతీసింది. అందుకు కేంద్రం విడుదల చేసిన అసర్ నివేదికే సాక్ష్యం. వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంది. ఇటీవల విడుదలైన అసర్ నివేదికను పరిశీలిస్తే.. దేశం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మూడో తరగతి చిన్నారుల్లో రెండోతరగతి పాఠ్యపుస్తకాలనైనా తడబడకుండా చదివే సామర్థ్యం 2022లో 16.3శాతం ఉంటే, 2024నాటికి 23.4 శాతానికి చేరింది. అందుకు భిన్నంగా మన రాష్ట్రంలో మూడో తరగతిలో ఉండి రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన విద్యార్థులు 2018లో 22.6 శాతం ఉంటే.. 2024లో 14.7 శాతానికి తగ్గారు. ఇది జగన్‌రెడ్డి పాలన డొల్లతనం. కేంద్రం విడుదల చేసిన అసర్ నివేదిక ఈ విషయాలను స్పష్టం చేసింది' అన్నారు. ఐదో తరగతి చదువుతూ రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన వాళ్లు 2018లో 57.1 శాతం ఉంటే, 2024లో 37.5 శాతానికి తగ్గారని అసర్ నివేదిక వెల్లడించిందన్నారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తానని హామీనిచ్చి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ నియామకం కూడా జరపలేదని దుయ్యబట్టారు. ఉపాధ్యాయులు తనకు సహకరించడం లేదని, సీపీఎస్ రద్దు చేయాలని పదేపదే అడగడంతో వారిపై ఉన్న అక్రోశాన్ని వెళ్లగక్కేందుకు జీఓ-117ను జగన్మోహన్‌రెడ్డి అస్త్రంగా వాడాడని దీపక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4,234 ప్రాథమిక పాఠశాలలను ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసి టీచర్లను, విద్యార్థులను ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ఎయిడెడ్ విద్యా వ్యవస్థను వైసీపీ నాశనం చేసిందని, జగన్‌రెడ్డి ఒక్క నెలకూడా సకాలంలో టీచర్లకు జీతాలు ఇవ్వలేదని దీపక్‌రెడ్డి గుర్తు చేశారు. 'అధికారంలోకి రాగానే ఇంగ్లీష్ మీడియం అన్నాడు. తరువాత సీబీఎస్‌ఈ, తరువాత బైజూస్, టోఫెల్, ఐబీ..... ఇలా విద్యార్థులతో, ఉపాధ్యాయులతో ఆటలాడుకున్నాడు. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ స్కూల్స్ లేకుండా చేస్తామని, ప్రతి బడికీ ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పి మోసం చేశాడని దుయ్యబట్టారు. నాడు నేడు పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చాడని, కోడిగుడ్లను గుత్తేదారు సకాలంలో బడికి సరఫరా చేయనిచోట విద్యార్థులకు గుడ్డుపెట్టలేదని ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాడంటూ వైసీపీ అనుసరించిన తప్పుడు విధానాలను ఎండగట్టారు. మద్యం షాపుల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టి వారిని అవమానపరిచాడంటూ, చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 90మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియామకం చేసిందని గుర్తు చేశారు. జూనియర్ కాలేజీల్లో 700మంది సిబ్బంది సేవలు పునరుద్ధరించిందని, 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో 3619 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను పునరుద్ధరించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 488 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కూటమి ప్రభుత్వం భర్తీ చేసిందని, ఇంటర్ కాలేజీ విద్యార్థులకూ ఉచిత పుస్తకాలు, బ్యాగులు పథకం పునరుద్ధరించిందన్నారు. 'ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం పునరుద్ధరించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐఐటీ, నీట్‌కి శిక్షణ ప్రారంభించింది. 'సాల్ట్' ద్వారా టీచర్స్‌కి శిక్షణనిచ్చి విద్యా వ్యవస్థను మెరుగుపరచిందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా మంత్రి లోకేష్‌లు విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టారని దీపక్‌రెడ్డి వివరించారు. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థపై రివ్యూ జరుపుతోంది. వచ్చే నేషనల్ సర్వేలో ఖచ్చితంగా ఆంధ్ర విద్యారంగంలో ముందంజలో ఉండటం ఖాయమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నిజంగా పనిచేసే తత్వమున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, మాటలు చెప్పి ప్రజల్ని మోసం చేసిన ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని.. రెండు ప్రభుత్వాల మధ్య తేడా నేడు కనబడుతోందన్నారు. గతంలో బాగా చేశామని చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం పిల్లల భవిష్యత్తుతో ఆడుకుందని, భవిష్యత్తును అగమ్యగోచరంలోకి నెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖలోని నిధులను నాడు నేడు పథకం పేరిట దోచుకున్నారని, వైసీపీ భ్రష్టవిధానాలకు అసర్ నివేదిక నిదర్శనమన్నారు. ఐదేళ్లు మాటలతో గడిపేసి.. విద్యా ప్రమాణాలను గత వైసీపీ ప్రభుత్వం దిగజార్చిందన్నారు. విద్యా మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో మార్పు కనబడుతోందని, రాబోయే కాలంలో నేషనల్ లెవల్‌లో ఒక బెస్ట్ స్టేట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని దీపక్‌రెడ్డి వివరించారు.

## నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు

# స్త్రీనిధి ద్వారా రుణాలివ్వాలి

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన వెనుకబడిన వర్గాలకు స్త్రీనిధి ద్వారా పెద్దఎత్తున రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం స్త్రీనిధి విభాగం విస్తరణకు సిద్ధం కావాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడలోని ప్రముఖ హోటల్‌లో జరిగిన స్త్రీనిధి వర్క్‌షాప్, సిబ్బంది సమీక్ష సమావేశాన్ని మంత్రి ప్రారంభించారు. స్త్రీనిధి సంస్థ ద్వారా పేద ప్రజలకు రాబోయే రోజులలో రుణాల పంపిణీ మొత్తాన్ని పెంచుతామన్నారు. పొదుపు సంఘాలలో నిరుపయోగంగా ఉన్న నిధులను స్త్రీనిధిలో డిపాజిట్ చేసి మహిళలకు పెద్దమొత్తంలో రుణాలను అందించేందుకు వెలుగు 2.0 ముందుకు సాగాలని మంత్రి సూచించారు. సెర్ప్ సీఈవో వాకాటి కరుణ మాట్లాడుతూ స్త్రీనిధి సంస్థకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ సెర్ప్, స్త్రీనిధి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్త్రీనిధి మేనేజింగ్ డైరక్టర్ జివిబిడి హరిప్రసాద్ స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీ, నిరర్థక రుణాల వసూలుపై సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు డిజియంలు, పదహారు జిల్లాల ఎజియంలు, మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, కేంద్ర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ అర్హత వైసీపీకి లేదు

- పెట్టుబడుల గురించి ఏముఖంపెట్టుకుని మాట్లాడతారు?
- లులూ, అదానీ డేటా సెంటర్‌ను జగన్‌రెడ్డి తరిమేశారు
- అమర రాజా బ్యాటరీస్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగారు
- రోజా, అమర్నాథ్, అంబటి వ్యాఖ్యలు హాస్యాస్పదం
- విశాఖ కేంద్రంగా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు కూటమి ఘనత
- సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు వెళ్తున్నాం
- కుట్రలతో జగన్ అండ్ కో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేరు
- ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం

అమరావతి (చైతన్య రథం): ఐదేళ్ల పాలనలో పైసా పెట్టుబడి తీసుకురాకపోగా, ఉన్న పరిశ్రమల్ని తరిమికొట్టిన జగన్ రెడ్డి అండ్ కో పెట్టుబడుల గురించి, ముఖ్యమంత్రి దావోస్ పర్యటన గురించి మాట్లాడడం హాస్యాస్పదమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విభజిత రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చే ప్రయత్నంలో భాగంగా నాడు చంద్రబాబు కాళ్లకు చక్రాలు కట్టుకుని తిరిగి పెట్టుబడులు సాధించారన్నారు. 'విశాఖ కేంద్రంగా మూడుసార్లు పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహించారు. అదానీ డేటా సెంటర్, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌లాంటి ప్రఖ్యాత కంపెనీలను రాష్ట్రానికి రప్పించారు. వాటిని జగన్‌రెడ్డి కుట్రచేసి తరిమేయడం వాస్తవం కాదా?' అని ప్రశ్నించారు. రాజకీయ కుట్రతో.. రాష్ట్రానికి వేల కోట్ల ఆదాయం సమకూర్చే అమరరాజా బ్యాటరీస్‌ను తరిమేస్తే.. తెలంగాణలో రూ.9 వేల కోట్ల పెట్టుబడి పెట్టడం వాస్తవం కాదా? అని నిలదీశారు. చంద్రబాబు కష్టంతో కియా కార్ల పరిశ్రమ అనంతపురంలో ఏర్పాటు చేస్తే.. అనుబంధ సంస్థల్ని జగన్ తరిమేసిన కారణంగా తెలంగాణ, కర్ణాటకలకు లబ్ది చేకూరిందని కొల్లు వ్యాఖ్యానించారు.

**ఇన్వెస్టర్లను తరిమేసి పెట్టుబడుల గురించి మాట్లాడడమా?**

ఏపీఐఐసీ ఛైర్మన్‌గా, పర్యాటక మంత్రిగా పని చేసిన రోజా ఎప్పుడు ఎక్కడ ఎలా కమిషన్లు దండుకోవాలా? అని ఆలోచించారే తప్ప.. ఏరోజైనా ఒక్క పరిశ్రమ తెచ్చారా? పర్యాటకరంగ అభివృద్ధికి ఒక్కరోజైనా చర్యలు తీసుకున్నారా? కోడిగుడ్డు పెట్టింది, పొదగాలని మాట్లాడే అమర్నాథ్ సైతం పెట్టుబడుల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. దావోస్‌లో చలిగా ఉంది, జలుబు చేస్తుంది, జ్వరం వస్తుందని డ్రామాలాడిన అసమర్థుడికి.. ఇప్పుడు దావోస్ గురించి ప్రశ్నించే అర్హత ఉందా? అని మంత్రి కొల్లు నిలదీశారు. జగన్‌రెడ్డి లండన్‌లో కూర్చుని ఏపీలో కుళ్లు రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటని మంత్రి కొల్లు మండిపడ్డారు.

**ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ వరకు..**

కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసేందుకు జగన్‌రెడ్డి కుట్రలు చేశారు. అయినా.. చంద్రబాబుపై నమ్మకంతో ఇన్వెస్టర్లు ముందుకొచ్చారు. విశాఖ కేంద్రంగా ప్రధాన మంత్రి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపన చేశారు. రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు,



పాయకరావుపేటలో బల్క్ డ్రగ్ పార్కు, రైల్వే ప్రాజెక్టులు, రైల్వే జోన్, నెల్లూరులో ఇండస్ట్రియల్ పార్కుకు, ఆర్సెస్ మిట్టల్ కంపెనీని జూమ్ కాల్‌తో ఒప్పించారు. టీసీఎస్, బీపీసీఎల్, రిలయన్స్, గ్రీన్ కో, పీపుల్ టెక్‌లాంటి కంపెనీలతో ఎంవోయూలు జరిగాయి. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ నినాదంతో పెట్టుబడుల్ని ఆకర్షించిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో పెట్టుబడిదారుల్ని ఆకర్షిస్తున్నారు. పెట్టుబడి పెట్టేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొల్లు స్పష్టం చేశారు.

**ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తాం**

సంక్షేమ కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. 'అధికారంలోకి రాగానే పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా రూ.4 వేలకు పెంచాం. ఏటా రూ.33 వేల కోట్లు పెన్షన్ల రూపంలో అందిస్తున్నాం. జూన్ నుండి తల్లికి వందనం ప్రారంభిస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బిల్లులు జగన్‌రెడ్డి ఎగ్గొడితే వాటిని అధికారంలోకి రాగానే క్లియర్ చేశాం. రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా సాయం అందిస్తున్నాం. జూనియర్ కాలేజీల్లో జగన్‌రెడ్డి నిలిపివేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని పున:ప్రారంభించాం. గ్యాస్ సిలిండర్లు అమలు చేస్తున్నాం. తల్లికి వందనం జూన్‌నుండి ప్రారంభించ బోతున్నాం. ఇప్పటికే 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. త్వరలోనే అన్నదాత పథకం కింద రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు మార్గదర్శకాలు రూపొందించాం. ఉపాధి కల్పనకు వీలుగా విద్యా విధానం మార్చాలని మానవ వనరుల మంత్రి నారా లోకేశ్ శ్రమిస్తున్నారు. దేశానికి మార్గదర్శకంగా ఏపీ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రచిస్తున్నాం. జగన్ రెడ్డి ఐదేళ్లలో చేయలేని పనుల్ని ఆరు నెలల్లోనే చేసి చూపిస్తున్నాం. ఆరు నెలల్లోనే 70 శాతానికి పైగా రోడ్లన్నీ బాగు చేశాం. కొత్త రోడ్లను వేశాం. వచ్చే ఆరు నెలల్లో గుంతలు లేని రోడ్లను సాకారం చేస్తాం. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుండి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. దాన్ని చూసి ఓర్వలేకనే దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు. జగన్‌రెడ్డి అండ్ కో ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడం సాధ్యం కాదని గుర్తుంచుకోవాలి' అని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

**తెలుగువారికి పద్మ అవారులు హర్షణీయం**

పద్మ అవార్డుల్లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వడంపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఉప రాష్ట్రపతి నందమూరి బాలకృష్ణ, దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డి, మందకృష్ణ మాదిగ, కె.ఎల్.కృష్ణ, మాడుగుల నాగఫణిశర్మలాంటి వారికి పద్మ అవార్డులు ప్రకటించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి కొల్లు ధన్యవాదాలు తెలిపారు.



# సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ముఖ్యం

**- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్**

**- బుడమేరు వరదల్లో సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేత**

అమరావతి, (చైతన్యరథం) : సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రజలకు సేవలు అందించడంలో యువత స్ఫూర్తిదాయకంగా నిలవాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. గత ఏడాది చోటు చేసుకున్న బుడమేరు వరద బీభత్సంతో అతలాకుతలమైన విజయవాడలో ప్రజలకు రాత్రింబవళ్లు మానవతా స్ఫూర్తితో సేవలు అందించిన 427 మంది యువతకు మంత్రి ఫరూక్ ప్రశంసాపత్రాలు అందజేశారు. బుధవారం సచివాలయంలోని న్యాయ మైనార్టీ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. బుడమేరు ముంపు ప్రాంతాలలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సత్వరమే అండగా నిలిచేందుకు తాను ఇచ్చిన పిలుపుతో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లి ఆధ్వర్యంలో సమితి సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని మంత్రి అన్నారు. యువత సేవలను అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేసి భవిష్యత్తులో కూడా సమాజాభివృద్ధిలో, ప్రజా సంక్షేమం కోసం యువత తన వంతు కృషి చేయాలని మంత్రి సూచించారు. బుడమేరు వరద ముంపు ప్రాంతాలలో సేవలందించిన 427 మంది స్కౌట్, జమీయాత్ యూత్ సభ్యులను అభినందించారు.

***మైనారిటీ సంక్షేమ అంశాలపై చర్చ***

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి ఫరూక్ సమీక్షించారు. బుధవారం మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ సీహెచ్ శ్రీధర్‌లతో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా నిధుల మంజూరు, చేపట్టనున్న కార్యక్రమాలకు ప్రతిపాదనలు తదితర అంశాలపై చర్చించారు.

# త్వరలోనే అక్రిడిటేషన్ల జీవో

**- మంత్రి కొలుసు పార్థసారథి హామీ**

**- ఏపీయూడబ్ల్యూజే వినతులకు స్పందన**

అమరావతి (చైతన్యరథం): అక్రిడిటేషన్ల జీవోపై కసరత్తు పూర్తయిందని, త్వరలోనే జీవో విడుదల చేసి సకాలంలో మంజూరు చేస్తామని సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. బుధవారం సచివాలయంలో తనను కలిసిన ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందా నికి మంత్రి ఆ మేరకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన బృందంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జయరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి. సురేష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.



అక్రిడిటేషన్ల సంఖ్యను కుదించడం కోసం గత ప్రభు త్వం విధించిన అడ్డగోలు నిబంధనలను తొలగించి అర్హులైన జర్నలిస్టులందరికీ మంజూరు అయ్యేలా చూడాలని యూనియన్ నాయకులు మంత్రికి విజ్ఞప్తి చేశా రు. జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీలకు గతంలో ఉన్న విచక్షణాధికారాలను పునరు ద్ధరించాలని, జీవో విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరారు. వారి వినతు లకు మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే జీవో విడుదల చేసి అర్హు లందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ జి.అనితతో కూడా యూనియన్ నాయకులు భేటీ అయ్యారు.

# బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తీసుకువస్తా

**సమష్టిగా కలిసి కృషిచేద్దాం: ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ(చైతన్యరథం): బీఎస్ఎన్ఎల్ ద్వారా ప్రజలకు మెరుగైన టెలికాం సేవలు అందిస్తూ పూర్వవైభవం తీసుకురావటానికి సమష్టిగా కలిసి కృషి చేద్దామ ని ఎన్టీఆర్ జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్ చెప్పా రు. చుట్టుగుంటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవా రం ఎన్టీఆర్ జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ 2024-26 సెషన్ మొదటి సమావేశం జరిగింది. టీఏసీ ఛైర్మన్‌గా తొలిసారి బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి విచ్చేసి న ఎంపీ కేశినేనికి బీఎస్ఎన్ఎల్ విజయవాడ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ కె.మురళీకృష్ణతో పాటు ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఏపీ సీజీఎం ఎం.శేషాచలంను ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌కు, ప్రజలకు అను సంధానంగా వ్యవహరిస్తానని చెప్పారు. త్వరలో 5జీ సేవలను విస్తరించాలని, అలాగే విజయవాడ బిజినెస్ ఏరియా ఏపీలోనే అగ్రగామిగా మంచి లాభాలతో వెళ్లాలని ఆకాంక్షించారు. బీఎస్ఎన్ఎల్ అభివృద్ధిలో భాగంగా తనవంతు సహాయ సహకారాలు అందజేయటానికి ఎల్లప్పుడూ ముందు ఉంటానని తెలిపారు. బీఎస్ ఎన్ఎల్ జీఎం కె.మురళీకృష్ణ మాట్లాడుతూ విజయవాడ బీఎస్ఎన్ఎల్‌కు సంబం ధించిన ప్రగతితో పాటు భవిష్యత్తు ప్రణాళికలు వివరించారు. త్వరలోనే ఏరియా లోని అన్ని టవర్లను 4జీలోకి మార్చి ఆ తర్వాత 5జీ సేవలను కూడా ప్రారంభి స్తామని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ఎఫ్‌టీటీహెచ్ ఫైబర్‌నెట్ సేవలలో ఎంతో అభివృ ద్ధి సాధించిందని, త్వరలోనే ఆధునికమైన హువాచీ ఎక్విప్‌మెంట్ ఉపయోగించి మరింత వేగవంతమైన ఇంటర్నెట్‌ను వినియోగదారులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ విజయవాడలోని వివిధ శాఖలకు చెందిన డీజీఎంలు, ఏజీఎంలు, సీఏవోలతో పాటు ఎస్‌డీఈలు పాల్గొన్నారు.

# రాకెట్ ప్రయోగాన్ని వీక్షించిన విద్యార్థులు

**- కలెక్టర్ వెంకటేశ్వర్ దంపతులతో పాటు రాక**
**- సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభావంతులకు అవకాశం**



శ్రీహరికోట(చైతన్యరథం): తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి తన వందో ప్రయోగమైన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను విజయ వంతంగా ప్రయోగించింది. బుధవారం ఉదయం 6.23 గంటలకు ఈ క్రయోజనిక్ రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపి భారత కీర్తిని మరింత ఇనుమడింపచేసింది. రాకెట్ ప్రయోగం నేపథ్యంలో సూళ్లూరుపేట పట్టణంలోని విద్యార్థులకు సుమారు 500 మంది ని గ్యాలరీలో వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దంపతులు సైన్స్ ఫెయిర్‌లో అద్భుత ప్రతిభ కనబరచిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎస్.కె.ఆఫ్రీద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లకు చెందిన టెన్త్ విద్యార్థిని ఎస్.హిమహన్షిని ఇస్రో రాకెట్ ప్రయోగ వీక్షణకు తమతో పాటు తీసుకువచ్చారు. ప్రయోగాన్ని వీక్షించి వారు కేరింతలు కొట్టారు. అనంతరం ఇస్రో చైర్మన్ వి.నారాయణన్, డైరెక్టర్ ఎ.రాజరాజన్, శాస్త్రవేత్తల బృందానికి కలెక్టర్ శుభా కాంక్షలు తెలిపి వారితో కలిసి ఫొటోలు దిగారు. భారత కీర్తిని ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలుపుతున్న ఇస్రో బృందాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరు పేట ఆర్డీవో కిరణ్మయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మహా కుంభమేళాలో తొక్కిసలాట దురదృష్టకరం

**- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్**



అమరావతి (చైతన్యరథం): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 20 మంది భక్తులు దుర్మరణం చెందడం దురదృష్టకరమని ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఘటన తెలిసి ఆవేదనకు లోనయ్యాను. మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించాలని కోట్ల మంది వచ్చిన క్రమంలో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. మన తెలుగు రాష్ట్రాల నుంచి మహా కుంభమేళాకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వ అధికారుల సూచనలు అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

# మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్క్

- 10.80 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- 365 రోజులూ నేతన్నలకు పనికల్పించడమే లక్ష్యం
- బీసీ సంక్షేమం, చేనేత జౌళి మంత్రి సవిత
- ఆ శాఖ కమిషనర్ రేఖారాణితో స్థల పరిశీలన

అమరావతి(చైతన్యరథం): మంగళగిరిలో ఆటోనగర్‌ను ఆనుకుని మెగా హ్యాం డ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత కార్మికులకు 365 రోజులు భృతి కల్పించే లక్ష్యంలో భాగంగా ఆ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తమిళనాడులోని కంచి తరహాలో దానిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. బుధవా రం మంగళగిరి ఆటోనగర్‌కు ఆనుకుని ఉన్న 10.80 ఎకరాలను చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి పరిశీలించారు. గత ప్రభుత్వం నుంచి ఐదేళ్లు ఎటువంటి సాయమూ అందకపోవడంతో పాటు ఉత్పత్తి అయిన వస్త్రాలు విక్రయించే మార్కెట్ సదుపాయం లభించకపోవడంతో ఎందరో నేతన్నలు అప్పుల పాలై తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని విచారం వ్యక్తం చేశారు. టీడీపీ పాలనలో చేనేతలకు ఎంతో మేలు జరి గిందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు అధికారంలో ఉండగా 2014-19లో చేనేతకు స్వర్ణయుగమన్నారు. వారి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచే శారు. నూలు కొనుగోలుకు రాయితీ, ఉచిత విద్యుత్ సదుపాయం, ముద్ర రుణాలతో పాటు త్రిఫ్ట్ పథకం అమలు చేశారని తెలిపారు. ఆనాటి ప్రయోజనాలతో పాటు మరి కొన్ని కొత్త పథకాలను నేతన్నలకు అందివ్వాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నిర్ణయించారని మంత్రి తెలిపారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. దీనిలో



భాగంగా ప్రభుత్వపరంగా ఆర్థిక దన్ను అందించడంతో పాటు 365 రోజుల పాటు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గడిచిన ఏడు నెలల కాలంలో రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో చేనేత బజార్లు ఏర్పాటు చేసి చేనేత వస్త్రా ల విక్రయాలు పెరిగేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో నూతన టెక్స్‌టైల్స్ పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలలతో పది నూతన క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ పార్కుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖలో 5 ఎకరాల్లో యూనిటీ మాల్‌ను ఏర్పాటు చేయబోతు న్నట్లు చెప్పారు. స్థల పరిశీలనలో చేనేత, జౌళి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఏడు నెలల్లో

# రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఉద్యోగాల కల్పనకు కంపెనీలతో ఎంవోయూలు
- జగన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సర్వనాశనం
- తప్పులను సమర్థించుకుంటూ బురదజల్లే యత్నం
- గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వంలో అన్ని రంగాల్లో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తుందని గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. బుధవారం సచివాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృ ద్ధిని శరవేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు గత ఏడునెలల్లో రాష్ట్రానికి రూ.6.33 లక్ష ల కోట్ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకోవ డం జరిగిందని తెలిపారు. దాంతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని చెప్పారు. ముఖ్యంగా విశాఖలో టీసీఎస్, ఎన్టీపీసీ, ఆర్సె లార్ మిట్టల్, హెచ్‌పీసీ, రిలయన్స్ వంటి కంపెనీలు భారీఎత్తున పెట్టుబడులు పెట్టను న్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన చేసిన తప్పులను సమర్థించుకుంటూ వైసీపీ నేతలు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇస్తే దానిపై విమర్శలు చేయడం సరికాదని ఖండించారు.

### జగన్‌రెడ్డి వల్లే రాష్ట్రం నాశనం

ఒక వ్యక్తి మూర్ఖత్వ పాలనతో ఏ రాష్ట్రమైనా, దేశమైనా నష్టపోతుందనేందుకు గత ప్రభుత్వ పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచక పోగా అన్ని రంగా ల్లో అధోగతి పాలు చేసి సుమారు రూ.10లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని ధ్వజ మెత్తారు. గత ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్‌కు సంబంధించి రూ. 2800 కోట్లు, అంగన్‌వా డీల్లో చిన్న పిలల్లకు అందించే చిక్కీలు, గుడ్లకు సంబంధించి రూ.1700 కోట్లు, ఉద్యోగులకు సంబంధించి రూ.20 వేల కోట్లు బకాయిలు చెల్లించ లేదని వివరించారు. అదేవిధంగా గృహ నిర్మాణానికి సంబం ధించి రూ.7,800 కోట్లు, ఉపాధి హామీ పథకానికి రూ.2100 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిందన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి కూడా పెద్దఎత్తున బకాయిలు చెల్లించలేదని తెలిపారు. రైతుల నుంచి కొను గోలు చేసిన ధాన్యానికి కూడా సకాలంలో సొమ్ము చెల్లించ లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం మొత్తం కుదేలైందని, చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను ఎక్కడికక్కడే నిలిపివేయడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఏపీకి జీవనాడైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు రూ.15 వేల కోట్లను కేంద్రం నుంచి మంజూరు చేయించుకోగలిగామని తెలిపారు. అమరావతి రాజధాని పనులను గత ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టి నిర్లక్ష్యం చేసి మూడు రాజధానుల పేరిట అసలు రాజధానే లేకుండా చేసిందని మండిపడ్డారు. కూటమి రాగానే 7 మాసాల్లోనే ప్రపంచ బ్యాంకు, హడ్కో, జైకా తదితర సంస్థల ద్వారా రూ.31 వేల కోట్లు సాధించుకోగలిగామని చెప్పారు. సూపర్‌సిక్స్ హామీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు విజయ వంతంగా అమలు చేయడం జరుగుతోందని, దానివల్ల 90 లక్షల మందికి లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గడిచిన ఏడు నెలల్లో ఏడేళ్ల అభివృ ద్ధిని చేసి చూపించిన దార్శనికుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పూర్తి కాని, మరమ్మతులు చేయలేని గ్రామ, పట్టణ, రాష్ట్ర రహదారులను పూర్తిచేసి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలంది స్తున్నామని చెప్పారు.

### హామీలు అమలు చేస్తూ మన్ననలు

ఓ వైపు అప్పుల కుప్ప, మరోవైపు గత ప్రభుత్వ బకాయిల తట్ట దర్శనమిస్తున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఈ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొం దుతున్నారు. 1000 పెన్షన్‌ను పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పడితే.. కూట మి పాలనలో చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే రూ.3 వేలు ఉన్న సామాజిక పెన్షన్‌ను రూ.4 వేలు చేశారు. ఇచ్చిన హామీ మేరకే ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే పెన్షన్ల పంపిణీ జరుగుతోందని తెలిపారు. ప్రతీ ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తా నని హామీ ఇచ్చి ఒక్క ఏటా కూడా డీఎస్సీని పూర్తి చేయకుండా జగన్‌రెడ్డి హామీని గాలికి వదిలేస్తే.. చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంతకం చేశారని గుర్తు చేశారు. పేదవారికి అన్నం పెట్టే లక్ష్యం తో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం మూసివేస్తే ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని పునరుద్ధరించడం జరిగిందని చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటైజేషన్ కాకుండా గత ప్రభుత్వం కనీస ప్రయత్నాలు చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక దాని సంరక్షణకు అనేక ప్రయత్నాలు చేసి సాధించినట్లు తెలిపారు. కేంద్రం నుంచి రూ.11,500 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అంతేగాక విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే శంకు స్థాపన జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రతి ఇంటిలో ఒక ఎంటర్ ప్రెన్యూర్‌ను తీర్చిదిద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# పేదరిక నిర్మూలనే కూటమి లక్ష్యం

- సంస్కరణల అమల్లో ఏపీ ముందడుగు
- సీఎం చంద్రబాబు విజనే దేశానికి దిక్సూచి
- కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్
- కేంద్ర మంత్రులతో వేదిక పంచుకునే అవకాశం






అమరావతి, (చైతన్యరథం) : పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూటమిగా పని చేస్తున్నాయని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రుల సమావేశంలో కేంద్ర మంత్రులతో వేదిక పంచుకునే అవకాశం దక్కడం విశేషంగా భావిస్తున్నానన్నారు. వివిధ రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ కార్మిక సంస్కరణలు అమలు చేయడం లో ఆంధ్రప్రదేశ్ ఎంతో ముందంజలో ఉందన్నారు. విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కార్మిక సంస్కరణలు 2015 నుండే అమలు చేశారన్నారు. వాటినే ఇప్పుడు కేంద్రం చాలా వరకు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ఆకర్షణతో పారిశ్రామికీ కరణలో ముందంజలో ఉండడంతో పాటు కార్మికుల సంక్షేమం పట్ల కూడా ఎంతో శ్రద్ధ వహిస్తోందని ఆయన కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ.4 వేల నుండి రూ. 15 వేల వరకు పెన్షన్లను అందిస్తున్నామన్నారు. ఇది దేశంలోనే అత్యధికమన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 25 లక్షల వరకు బీమా అందిస్తున్నామని ఇది కూడా దేశంలోనే అత్యధికమని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ప్రజల పట్ల, కార్మికుల పట్ల ఉండే నిబద్ధతకు ఇది నిదర్శనం అని కేంద్రమంత్రులు కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర సాధన -2047 లక్ష్యంగా ఒక విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్రను భాగ్యస్వామ్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు, రాష్ట్రంలో అమలవుతున్న వివిధ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, అభివృద్దే తారక మంత్రంగా ఒక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారన్నారు.



## చంద్రబాబుది విజన్..

# జగన్‌ది విధ్వంసం!

- ఫ్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సే సాక్షీభూతం..
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉద్ఘాటన

అమరావతి (చైతన్య రథం): గత ఐదేళ్లుగా టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేయడమే కాదు, దాని వెనుక సొంత కాళ్లపై నిలబడాలన్న ఒక బలమైన వ్యవస్థనూ వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ వాస్తవాన్ని ప్రజలు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడ రూరల్ జక్కంపూడిలో 2018లో నిర్మాణం చేపట్టిన "ఫ్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్"ను మంత్రి పరిశీలించి, నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. జరిగిన విధ్వంసాన్ని చూసిన చలించిపోయిన మంత్రి కొండపల్లి మాట్లాడుతూ నిరుపేదలు, దిగువ మధ్యతరగతి భవిష్యత్తుకు బలమైన పునాదులను గత వైకాపా ప్రభుత్వం ఏవిధంగా కూల్చిందన్నది ప్రజలకు స్వయంగా తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కాంప్లెక్స్ ద్వారా టిడ్కో ఇళ్ళలో నివాసం ఉండే ప్రజలకు స్వయం ఉపాధి కల్పించడం ప్రధాన ఉద్దేశంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. కొద్దికాలంలో ఒక భారీ ఫ్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రారంభించి దాదాపు పూర్తి చేశారు. అన్ని సదుపాయాలను కేవలం 3 నెలల్లో కల్పించి, మరో 4 నెలల్లో అందుబాటులోకి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.

ఆ సమయంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో అప్పటి ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయి రాష్ట్రంలో వైకాపా పాలన ప్రారంభమైంది. చిన్న మధ్య తరహా కంపెనీలకు బలమైన వేదిక కావాల్సిన కాంప్లెక్స్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైంది. దీంతో చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.

టిడ్కో ఇళ్ళలో నివాసం ఉండేవారికి ఉపాధి కల్పించే కార్యక్రమానికి వైసీపీ ప్రభుత్వం పాతరేసిందని మంత్రి కొండపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధ్వంసం నుంచి అభివృద్ధి దిశగా సాగుతున్న నేటి ప్రభుత్వం.. నైపుణ్యం పెంపునకు కావాల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. టిడ్కో ఇళ్ళలో నివాసం ఉండే పేదలు, వారసులు ఉద్యోగ, ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా కాంప్లెక్స్ ద్వారా ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ ఫ్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు ప్రాణం పోసి, టిడ్కో ఇళ్ళు అనేవి కేవలం నివాస సముదాయాలే కాదు, భవిష్యత్తుకు భరోసా కల్పించే సౌధాలుగా మార్చుతామన్నారు. జగన్ హయాంలో సాగిన విధ్వంసానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన జక్కంపూడి ఫ్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను ఉత్పత్తి, ఉపాధి కేంద్రంగా మారుస్తామని మంత్రి శ్రీనివాస్ వెల్లడించారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

- కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- కూటమి ముఖ్య నాయకులతో సమావేశం



గుంటూరు(చైతన్యరథం): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు బీజేపీ, టీడీపీ, జనసేన ముఖ్యనేతలు కృషి చేయా లని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆలపాటి గెలుపు కోసం బుధవారం నగరంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెమ్మసాని పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఉండటం వల్ల రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీ ఆధ్వర్యం లో కూటమి ప్రభుత్వం ప్రతి పథకాన్ని ప్రజలకు అందించడానికి పనిచేస్తున్నారు. కూటమిలో ఉన్న నాయకులు ఏకతాటిపైకి వచ్చి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆల పాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. నాటి ఎన్నికల్లో ఆలపాటి కూట మి అభ్యర్థికి పూర్తి సహకారం అందించి 50 వేల మెజారిటీతో తెనాలి సీటును గెలిపిం చిన విషయాన్ని గుర్తు చేశారు. గుంటూరు జిల్లా ప్రజలకు ఏది కావాలన్నా మంత్రిగా తాను సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా, జనసేన నుంచి గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, డేగల ప్రభాకర్, పిల్లి మాణిక్యాలరావు కూటమి ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

## అడ్డగోలు గనుల లీజు రద్దు

# జగన్‌రెడ్డి బంధువుకు చెక్

## రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి



అమరావతి, (చైతన్యరథం) : అడ్డగోలుగా జరిగిన వైఎస్ వెంకటరెడ్డి బైరటీస్ గనుల లీజును రద్దు చేసినట్లు మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈ మేరకు అమరావతిలో బుధవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలో విలువైన వైట్ బైరైటీస్ గనుల లీజు ఆర్డర్‌ను గనుల శాఖ డైరెక్టర్ తన విచక్షణాధికారంతో ఈ నెల 15వ తేదీన ఇచ్చారు. సాధారణంగా మైనర్ గనులు రోడ్ మెటల్, గ్రానైట్, బైరైటీస్ వంటి ఖనిజాల మంజూరు మంత్రి అధికార పరిధిలోకి రావు. మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి బంధువు వైఎస్ వెంకట్ రెడ్డి బైరైటీస్ గనుల కేటాయింపు విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాకుండా జారీ చేశారు. క్వారీ లీజు అనుమతుల మంజూరు అధికారాలు మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ ప్రత్యేక విచక్షణాధికార పరిధిలోనే ఉంటాయి. గడువు దాటిన తర్వాత నిబంధనలకు విరుద్ధంగా గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి అనుమతులిచ్చారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సన్నిహితంగా ఉంటూ, గత ప్రభుత్వంలో నియమితుడై ప్రస్తుతం అదే హోదాలో కొనసాగుతున్న ఓ ముఖ్య అధికారి ఈ ఫైలును వేగంగా కదిలేలా చేసేందుకు సర్క్యులర్ జారీ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి వెల్లడించారు. ఈ అంశంపై పత్రికల్లో వచ్చిన వార్తలను పరిశీలించిన నేపథ్యంలో జరిగిన తప్పిదాలను గుర్తించి అమల్లో ఉత్తర్వులు నిలిపివేస్తూ మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ వ్యవహారంపై లోతుగా పరిశీలన చేసి బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సహజ సంపద కేటాయింపులు, వచ్చే ఆదాయం ఏదైనా ప్రభుత్వానికి, ప్రజలకు చెందాలి తప్ప అక్రమార్కుల పరం కాకూడదనేది కూటమి ప్రభుత్వ విధానమని అందులోభాగంగానే చర్యలు తీసుకున్నామని మంత్రి కొల్లు వెల్లడించారు.

# మంత్రి నాదెండ్లని కలిసిన సివిల్ సప్లయిస్ కమిషనర్



అమరావతి (చైతన్యరథం): సివిల్ సప్లయిస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సౌరభ్‌గౌర్ బుధవారం సచివాలయంలో పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పౌరస రఫరాల వ్యవస్థను మరింత సమర్థ వంతంగా నిర్వహించడం, నాణ్యమైన సేవలను ప్రజలకు చేరువ చేయడం తదితర అం శాలపై చర్చించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శక సేవలు అందించేందుకు పాలనలో సమర్థతను పెంచాలని నాదెండ్ల సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ సౌరభ్ గౌర్ పేర్కొన్నారు.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

## మిజిల్స్ వ్యాధి బాధితులకు పూర్తిస్థాయి వైద్యం అందిస్తాం

● రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



అరకు (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జిజిహెచ్‌లో పెదబయలు మండలం గిన్నెల కోట పంచాయతీకి చెందిన కందులు పెదపాడు పుట్టకోట మెత్తగూడ గొట్టంగి గ్రామాలకు చెందిన గిరిజనులు పలువురు మిజిల్స్ వ్యాధితో బాధపడుతున్న వారిని మాజీ మంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షులు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పరామర్శించి రోగులకు వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతి పేషెంట్ దగ్గరకి వెళ్లి ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని రకాల ఆదుకుంటుందని, పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తామని ఈ వ్యాధి ఎలా వచ్చిందనే దానిపై డబ్ల్యూహెచ్‌తో పరిశోధన చేస్తున్నామని, ప్రతిఒక్కరూ ధైర్యంగా ఉండాలని మిజిల్స్ వ్యాధితో బాధపడుతున్న వారిని ధైర్యం చెప్పారు. మిజిల్స్ వ్యాధితో బాధపడుతున్న వారిని పరామర్శిస్తున్న సందర్భంలో పాడేరు శ్రీకృష్ణాపురం స్కూల్లో చదువుతున్న కీముడు అంకితకు లక్షణాలు ఉన్నాయని, వెంటనే శ్రీకృష్ణాపురం స్కూల్లో వైద్య సిబ్బంది వెళ్ళాలని డిఎమ్ అండ్ హెచ్‌ఓకు ఆదేశించారు. గిన్నెలకోట పంచాయతీ నుండి వైద్యం పొందుతున్న వారికి పూర్తిస్థాయి వైద్యం అందించి ఎప్పటికీ అప్పుడు పర్యవేక్షించి ఆసుపత్రి సూపరిడెండెంట్ విశ్వమిత్రకు ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై ఆసుపత్రిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ అంబులెన్స్‌ల అవసరం ఉందని, అలాగే సిబ్బంది కొరత ఉందని వైద్య సిబ్బంది కోరగా చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ విశ్వమిత్ర డాక్టర్ నర్సింగరావు, డాక్టర్ రవికిరణ్, మాజీ జడ్పీటీసీ సుబ్బారావు, దారేల సర్పంచ్ పాండు రంగస్వామి, స్టేట్ ఎస్టీ సెల్ కార్యదర్శి తిరుపతిరావు, గిన్నెలకోట ఎంపీటీసీ రాధ, కొండబాబు, అనంతగిరి మండల ప్రధాన కార్యదర్శి ఆనందరావు, పెదబయలు మండల ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు మురళి అచ్చిబాబు, ఎస్టీ సెల్ కార్యదర్శి శంకర్, బీజేపీ నాయకులు గంగరాజు జగదీష్, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● వైద్యులు సమయపాలన పాటించాలని ఆదేశం
● ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచి వాతావరణం కల్పించాలి
● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం (చైతన్యరథం): ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యుల హాజరు, ప్రతిరోజు ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారు అనే విషయాలను వైద్యులకు అడిగి తెలుసుకున్నారు. సేవా దృక్పథంతో వైద్యసేవలు అందించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగాఉండాలని సిబ్బందిని ఆదేశించారు. రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలు, సమయానికి ఆహారం అందిస్తున్నారా ఆరా తీసారు. చిన్నారుల వార్డు, జనరల్ వార్డు, స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతంఉన్న పరికరాలు పనిచేస్తున్నాయా లేదా అనే విషయాలు అడిగితెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.

### సంక్షేమ ఫలాలు అందరికీ అందిస్తాం

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షే పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ చేరువచేస్తామని ప్రజలకు వివరించారు. వివిధ సమస్యలపై మంత్రి ప్రజల వినతపత్రం ఇచ్చిన వెంటనే వాటిని పరిశీలించి, గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులకు సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. నాలుగు మండలాల అధికారులు హాజరైయ్యారు.

# బాధ్యతగా పనిచేయండి : నిమ్మక జయకృష్ణ

పాలకొండ (చైతన్యరథం): మండల స్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ పి.అప్పలరాజుకు సూచించారు. రహదారులు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి స్థల సేకరణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీఎం జన్‌మన్ ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.గీతాంజలిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సాగర్, ఐకేపీ ఏపీఎం కమలకుమారి, ఏవో శ్రీదేవి పాల్గొన్నారు.



## మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరికలు




పాలకొండ (చైతన్యరథం): పాలకొండ నగర పంచాయతీకి చెందిన రెండో వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లీశ్వరి, ఆమె భర్త కుమార్ మంగళవారం వైకాపాను వీడి తెదేపాలో చేరారు. శ్రీకాకుళంలోని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్నాయుడు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో పార్టీ కండువా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.సింహాద్రి పాల్గొన్నారు. నగర పంచాయతీలో ఖాళీగా ఉన్న అధ్యక్షురాలి పదవికి ఎన్నికల సంఘం వచ్చే నెల 3న ఎన్నికలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నగర పంచాయతీలో 19 మంది కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అధ్యక్ష పదవిని ఎస్సీలకు కేటాయించిన నేపథ్యంలో ఈమె ఒక్కరికే అర్హత ఉంది. ఈ నేపథ్యంలో ఈమె తెదేపాలో చేరడం చర్చనీయాంశమైంది.

## మన్యంలో కొనసాగుతున్న చలి తీవ్రత



మన్యం (చైతన్యరథం): మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతుండడంతో చలి తీవ్రతకు గిరిజనులు వణుకుతున్నారు. జి.మాడుగులలో 9.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదుకాగా, అనంతగిరి, పెదబయలులో 12.6, డుంబ్రిగుడలో 12.8, చింతపల్లిలో 13.5, జీకేవీధిలో 13.7, పాడేరులో 13.9, అరకులోయలో 14.0, హుకుంపేటలో 14.1, కొయ్యూరులో డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీలో మంగళవారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్మేసింది. దీంతో చలి తీవ్రత సైతం కొనసాగుతోంది. ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగమంచు కురవడం, మధ్యాహ్నం రెండు గంటల సేపు మాత్రమే గట్టిగా ఎండ కాస్తుండడంతో పగలు, రాత్రి తేడా లేకుండా చలి ప్రభావం అధికంగానే ఉంది.

# భరత మాత తల రాతను మార్చిన విధాత గాంధీ



'ఇలాంటి ఓ వ్యక్తి ఈ భూ మండలం మీద రక్తమాంసాలు గల శరీరంతో మనుగడ సాగించారంటే ముందు తరాల వారు నమ్మలేకపోవచ్చు..' - మహాత్మా గాంధీని ఉద్దేశించి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్న మాటలివి. గాంధీజీ జీవితం గురించి చదివినవారికి ఈ మాటలు అతిశయోక్తిగా అనిపించవు. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన నాయకుల్లో ముందు వరసలో నిలిచే మహానేత గాంధీజీ. సత్యం, అహింస అనే ఆయుధాలతో ప్రపంచానికి కొత్త దారి చూపిన మహాత్ముడు. ఆ అస్త్రాలను వాడటానికి సైతం ఎంతో ధైర్యం కావాలని నిరూపించారు. భారత స్వాతంత్ర్య పోరాటాన్ని, మహాత్మా గాంధీ జీవితాన్ని విడదీసి చూడలేం. నూలు వడుకుతూ, మురికివాడలు శుభ్రం చేస్తూ, సామాన్యుల్లో సామాన్యుడిగా కలిసిపోయి.. భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్మించారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారు. సుప్రసిద్ధ సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అన్నట్లు.. కొంత మంది ఇంటి పేరో, ఊరికొక్క వీధి పేరో కాదు 'గాంధీ'. కరెన్సీ నోట్ల మీద, నడి రోడ్డు మీద మనం చూస్తున్న బొమ్మ అంతకన్నా కాదు.. 'భరత మాత తల రాతను మార్చిన విధాత గాంధీ.. తరతరాల యమ యాతన తీర్చిన వరదాత గాంధీ..' గాంధీజీ చరిత్ర అపురూపం. సిరివెన్నెల మాటల్లోనే చెబితే.. 'కర్మ యోగమే జన్మతతా.. ధర్మ క్షేత్రమే బ్రతుకంత. సూర్యుడు అస్తమించని రాజ్యానికి పడమర దారిని చూపిన క్రాంతి, తూరుపు తెలరని నడిరాత్రికి స్వేచ్ఛా బాణుడి ప్రభాత కాంతి. పదవులు కోరని పావనమూర్తి.. హృదయాలేలిన చక్రవర్తి' గాంధీ.... ఆయన అసలు పేరు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. గుజరాత్ రాష్ట్రంలోని కథియవాడ్ జిల్లా పోరుబందర్ గ్రామంలో 1869 అక్టోబర్ 2న కరంచంద్ గాంధీ, పుత్లీబాయి దంపతులకు ఆయన జన్మించారు. గాంధీజీ తండ్రి పోరుబందర్ సంస్థానంలో ఒక దివాన్‌గా పని చేసేవారు. తల్లి హిందూ సంప్రదాయాలను పాటించే వ్యక్తి. చదువులో గాంధీజీ చురుకైన విద్యార్థి కారు. ఈ విషయాన్ని తన ఆత్మకథ 'సత్యంతో నా ప్రయోగాలు'లో స్వయంగా ఆయనే తెలిపారు. తరగతి గదిలో ఎక్కువ సిగ్గుపడుతూ ఆయన వెనుక వరసలో కూర్చొనేవారట. గాంధీజీ ప్రాథమిక విద్య రాజ్ కోట్‌లో, ఉన్నత విద్య కథియవాడ్‌లో పూర్తి చేశారు. అనంతరం ఉన్నత చదువుల నిమిత్తం దక్షిణాఫ్రికా వెళ్లారు. తెల్లవారిపై మొట్టమొదటిసారిగా తిరుగుబాటు అక్కడ నుంచే మొదలుపెట్టారు. వర్ణ వివక్షపై గాంధీజీ చేసిన ఆ పోరాటం దక్షిణాఫ్రికాలోని నల్లవారిలో ఆత్మవిశ్వాసం పెంచింది. ఆ పోరాటం అంటటితో ఆపేది కాదని గాంధీజీకి అక్కడే అర్థమైంది. 1915 జనవరి 9న భారత్ తిరిగొచ్చి స్వాతంత్ర్యోద్యమ కదనరంగంలోకి దూకారు. యావత్ దేశాన్ని ఏకధాటిపైకి తీసుకొచ్చి స్వాతంత్ర్యం సిద్ధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో అనేక ఉద్యమాలను నడిపించారు. జాతిపిత మహాత్మా గాంధీ, పటేల్, నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇతర నేతల సుదీర్ఘ పోరాట ఫలితంగా 1947 ఆగస్టు 15న భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంది. కానీ, బ్రిటిషర్లు దేశాన్ని భారత్, పాకిస్థాన్‌గా విభజించారు. ఇది హింసకు దారితీసింది. హింసాత్మక ఘటనల్లో లక్షలాది మంది ప్రజలు మరణించారు. ఇది గాంధీజీని తీవ్ర కలతకు గురిచేసింది. శాంతికి పిలుపునిచ్చిన గాంధీజీ హింసాత్మక ప్రాంతాల్లో పర్యటించి గొడవలు సద్దుమణిగేలా చేశారు. ఆయన లేకపోతే పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం వాటిల్లేదని చరిత్రకారుల అభిప్రాయం. దేశ విభజన, అనంతర పరిణామాల నేపథ్యంలో 1948 జనవరి 30న గాంధీజీ అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. ఆ రోజు సాయంత్రం ఢిల్లీలో బిర్లా నివాసం వద్ద ప్రార్థనా మందిరానికి వెళ్తుండగా నాథూరామ్ గాడ్సే ఆయన్ని అతి దగ్గర నుంచి కాల్చి చంపాడు. జగత్తును ప్రభావితం చేసిన ఓ మహా ప్రాణం.. 'హే రామ్' అంటూ అనంత వాయువుల్లో కలిసిపోయింది.

(నేడు మహాత్మా గాంధీ 77వ వర్ధంతి)

# రూ.8 లక్షల కోట్లు ప్రజాధనం దోపిడి చేసి ఇంటికి పోయాడు జగన్

● రాజమండ్రి సిటీ నియోజకవర్గ టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత జగన్మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం అమలు చేశాడు. అది మర్చిపోయినట్లుగా వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదని విమర్శించడానికి సిగ్గు లేదా..? అని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆనంద్ రీజన్సీ పందిరి హాలులో బుధవారం జరిగిన రాజమండ్రి సిటీ నియోజకవర్గ టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... వైసీపీ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్లపాలనలో జగన్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి ఇంటికి పోయాడని విమర్శించారు.రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేశాడని, మరో రూ.8 లక్షల కోట్లు జగన్ కుటుంబం దోపిడీ చేసిందని ఆరోపించారు. మొత్తం రూ.18 లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశాడని విమర్శించారు. సంక్షేమ పథకాల్లో జగన్ ఎన్ని కోతలు పెట్టాడో ప్రజలందరికీ తెలుసన్నారు. విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందని సాకు చూపి వృద్ధుల పెన్షన్లు తొలగించాడని, అమ్మఒడి షరతులు విధించాడన్నారు. విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచాడని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదని వైసీపీ నాయకులు నిస్సిగ్గుగా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని, జగన్ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్ది పాలన గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రూ.70 వేల కోట్లు వడ్డీలు చెల్లించడానికే సరిపోతోందని తెలిపారు. రాష్ట్రం ఇప్పుడు సుభిక్షంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేయాలనే దృక్పథం తమకు ఉందని చెప్పారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నా రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్‌లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచారని గుర్తు చేశారు.

రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ఐదేళ్లపాటు కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించలేదని విమర్శించారు. గతంలో మూడు సార్లూ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ గెలిచింది. కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధీమా వ్యక్తంచేశారు. అయితే ఈ ఎన్నికలు జరపడానికి సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. త్వరలో వాటిని అధిగమించి ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్ళాలి ఎలా క్లైవసం చేసుకోవాలనేది సర్వసభ్య సమావేశంలో చర్చించి తీర్మానం చేసినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఆర్యాపురం, జాంపేట బ్యాంకులు, రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ మనమే క్లైవసం చేసుకున్నామని అన్నారు. టీడీపీ జెండా భుజాన మోసి పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామని, ఎండోమెంట్ కమిటీల్లో వారికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఐదేళ్ళ గడిచేసరికి అందరినీ పందెం కోళ్ళుగా తయారు చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

# అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది : గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం బొమ్మూరు గ్రామశివారు నేతాజీ నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... ప్రజల అభీష్టం మేరకు పనులు జరుగుతున్నాయని, అభివృద్ధి జరుగుతున్న సమయంలో స్థానికులు సహకరించాలని తగాదాలు పడకూడదని తెలిపారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... ఈ ప్రాంతం నందు మెయిన్ డ్రెయిన్ పనులు త్వరలో మొదలు పెడతామని, ఈ మురుగు నీరు మొత్తం ధవళేశ్వరం వద్దకు చేరుతుందని, అక్కడ పంప్ హౌస్ నిర్మించే విధంగా చర్యలు చేపడుతున్నామని, పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చాల్సి ఉందని, కొంత సమయం పడుతుందని, వరదల సమయంలో మురుగునీరు కాలనీలోకి ప్రవేశించకుండా కాంక్రీట్ వాల్ నిర్మించవలసిన అవసరం ఉందన్నారు. వీటన్నిటిని పుష్కరాల నాటికి పూర్తి చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. స్థానికుల అభ్యర్థన మేరకు కొండ ప్రాంతమైన ఖాళీ కృష్ణానగర్ రోడ్డు నుండి బృందావన కాలనీ వద్ద దిగుటకు ఆక్రమణలు తొలగించి, విశాలమైన రోడ్డు నిర్మించేందుకు స్థలాన్ని సర్వే చేసి అంచనాలు సిద్ధం చేయాలని, అలాగే 10, 11 వీధులను కలుపుతూ రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అక్కడ నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు.

# పెనుగొండలో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన

పెనుగొండ శ్రీనగరేశ్వరస్వామి మహిషాసుర మర్దని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 31న నిర్వహించే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పెనుగొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హెలీప్యాడ్ స్థలాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం నగరేశ్వర మహిషాసుర మర్దని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్, ఎస్పీ, జేసీలకు శేషవస్త్రాలను కప్పి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు పలికారు. ఆలయాన్ని పరిశీలించిన అనంతరం నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో ఈనెల 31న హెూమం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వాసవి ధామ్‌ను సందర్శించి 90 అడుగుల కన్యకాపరమేశ్వరి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు.

# టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్

● పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన పెమ్మసాని



గుంటూరు (చైతన్యరథం): నగరంలో వైసీపీకి వరుస షాకులు తగులుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై జగన్‌పార్టీకి చెందిన కార్పొరేటర్లు తెలుగుదేశంలోకి క్యూ కడుతున్నారు. 57వ డివిజన్‌కు చెందిన మహిళా కార్పొరేటర్ పఠాన్ రిహానా గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి పెమ్మసాని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్, టీడీపీ నాయకులు భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో కార్పొరేటర్ మాట్లాడుతూ... 'గుంటూరులో గతంలో జరగని అభివృద్ధిని నేడు చూస్తున్నాం. పెమ్మసాని మంజూరు చేయించిన మూడు వంతెనలే ఇందుకు తార్కాణం. అందుకే వైసీపీని వీడుతున్నాను.' అని 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహానా అన్నారు. కాగా 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, 31వ డివిజన్ కార్పొరేటర్ అంగుదుల సంతోష్, 27వ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, 26వ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి కొద్ది రోజుల క్రితమే టీడీపీ కండువా కప్పుకున్నారు.

# 5 ఏళ్లలో 10 లక్షల కోట్ల అప్పులు... రాష్ట్ర, ప్రజల ఆస్తులు లూటీ.. ఇదీ జగన్ ఘనత

● సీఎం పదవి అంటే రోజువారీ వసూళ్లు, నెలవారీ మామూళ్లు అన్నట్లు జగన్ పాలన సాగింది : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): అంతులేని అవినీతి, అరాచకపాలనతో నవ్యాంధ్రప్రదేశ్‌ను నామరూపాల్లేకుండా చేసిన జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు నేడు కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబు పనితీరుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని, నిజాలు అంగీకరించే దమ్ము, ధైర్యం లేకనే వైసీపీనేతలు వాస్తవాలు విస్మరించి పెద్ద నీతిమంతుల్లా మాట్లాడుతున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారడానికి, ఆఖరికి ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వం తర్జనభర్జన పడే పరిస్థితి రావడానికి ముమ్మాటికీ జగన్‌రెడ్డి, ఆయన ప్రభుత్వ అవినీతే కారణమని బుధవారం పత్రికాప్రకటన ద్వారా పుల్లారావు తేల్చిచెప్పారు. "ఐదేళ్లు అధికారం వెలగబెట్టి, అడ్డగోలుగా రాష్ట్రాన్ని దోచేసిన జగన్‌రెడ్డి.. వైసీపీనేతలు, ఇప్పుడు వాస్తవాలు విస్మరించి, ప్రజలపై తమకే ప్రేమ ఉన్నట్టు అసత్యాలు, అవాస్తవాలు వల్లెవేయడం సిగ్గుచేటు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలకు అందించిన సంక్షేమం అంతా నేతిబీరలో నెయ్యి చందమే. మాయమాటలు, మోసాలతో ప్రజల్ని ఏమార్చి, వారికి గోరంత సాయం చేసి కొండంత దోచేశాడు. జగన్‌రెడ్డి ఆయన పరివారం, రాష్ట్రాన్ని ఆర్థికంగా, భౌగోళికంగా కూడా పీల్చిపిప్పిచేశారు. ముఖ్యమంత్రి పదవి అంటే రోజువారీ వసూళ్లు.. నెలవారీ మామూళ్లే అన్నట్టుగా జగన్‌రెడ్డి తాడేపల్లి కేంద్రంగా తన దోపిడిని కొనసాగిస్తే, మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు వారి పరిధిలో వారు అందినకాడికి దండుకున్నారు. 5 ఏళ్లలో రూ. 10లక్షల కోట్ల అప్పులభారం మోపిన జగన్‌రెడ్డి, అతని కుటుంబం రూ. 8లక్షల కోట్ల రాష్ట్ర సంపదను అడ్డగోలుగా దోచేసింది. ప్రకృతి వనరుల్ని, ప్రజల ఆస్తుల్ని అడ్డగోలుగా దోచేసిన జగన్‌రెడ్డి అండ్ కో రాష్ట్రంపై రూ. 10లక్షల కోట్ల అప్పుల భారం మోపింది వాస్తవం కాదా? కాగ్‌కు కూడా లెక్కలు చెప్పకుండా చాపకింద నీరులా తన అవినీతిని ఖండాంతరాలకు వ్యాపించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. 5 ఏళ్ల పాలనలో జగన్ రెడ్డి, అతని కుటుంబం రూ. 8లక్షలకోట్ల రాష్ట్రసంపదను దోచేసింది. జగన్ తన విలాసాలకోసం రూ. 20వేలకోట్ల ప్రజలసొమ్మును దుర్వినియోగం చేశారు. జగన్ చేసిన అప్పులకు ఏటా అసలు వడ్డీలకే రూ. 1.40లక్షలకోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన దుస్థితి. తన చేతగానితనం, అసమర్థతతో జగన్‌రెడ్డి పెండింగ్ పెట్టిన రూ. 22వేలకోట్ల బకాయిల్ని చెల్లించిన ఘనత చంద్రబాబుది. ధాన్యం కొనుగోళ్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తాలూకా బకాయిల్ని చెల్లించింది కూటమి ప్రభుత్వం. పట్టువదలని విక్రమార్కుడిలా చంద్రబాబు రాష్ట్రం కోసం శ్రమిస్తున్నారు... అప్పులభారం... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి... జగన్ చేసిన విధ్వంస ప్రభావం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా చంద్రబాబు పట్టుదల, సంకల్పంతో ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. ఒకవైపు అప్పులభారం.. మరోవైపు క్షీణించిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూటమిప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా హామీల అమలు, రాష్ట్రాభివృద్ధికోసం ఒక ప్రణాళికతో చంద్రబాబు పట్టువదలని విక్రమార్కుడిలా శ్రమిస్తున్నారు." అని మాజీమంత్రి స్పష్టం చేశారు.

# గన్నవరంను ఐటీ హబ్‌ను తీర్చిదిద్దండి



గన్నవరంను ఐటి హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని హెచ్.సి.ఎల్ టెక్ సంస్థ ప్రతినిధులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కోరారు. బుధవారం విజయవాడ ఎమ్మెల్యే కార్యాలయంలో హెచ్.సి.ఎల్ టెక్ విజయవాడ సెంటర్ హెడ్ శివప్రసాద్, జీడబ్ల్యూఎస్ అడ్మిన్ హెడ్ జి.శ్రీనివాసరావు యార్లగడ్డను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కేంద్రం అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, మరియు మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. ఐటీ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# బి.ఎస్.ఎన్.ఎల్.కు పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు సమిష్టిగా కృషి చేద్దాం : కేశినేని శివనాథ్

**●టీ.ఎ.సి చైర్మన్‌గా ఎంపీ కేశినేని తొలి సమావేశం**




విజయవాడ (చైతన్యరథం): బి.ఎస్.ఎన్.ఎల్ ద్వారా ప్రజలకు మెరుగైన టెలికాం సేవలను అందించేందుకు, పూర్వవైభవం తీసుకురావటానికి సమిష్టిగా కలిసి కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. చుట్టుగుంటలోని బి.ఎస్.ఎన్.ఎల్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఎన్టీఆర్ జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ 2024-26 సెషన్ మొదటి సమావేశం జరిగింది. టి.ఎ.సి చైర్మన్‌గా తొలిసారి బి.ఎస్.ఎన్.ఎల్ కార్యాలయానికి విచ్చేసిన ఎంపి కేశినేని శివనాథ్‌కి బి.ఎస్.ఎన్.ఎల్ విజయవాడ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ కే. మురళీకృష్ణ ఐ.టి.ఎస్‌తో పాటు ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ ఏపీ సీజీఎం ఎం.శేషాచలంను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... బి.ఎస్.ఎన్.ఎల్.కు ప్రజలకు అనుసంధానంగా వ్యహరిస్తానన్నారు. త్వరలో బి.ఎస్.ఎన్.ఎల్. 5జి సేవలను విస్తరించాలని, అలాగే విజయవాడ బిజినెస్ ఏరియా ఆంధ్రప్రదేశ్‌లోనే అగ్రగామిగా మంచి లాభాలతో వెళ్లాలని సూచించారు. బి.ఎస్.ఎన్.ఎల్. అభివృద్ధిలో భాగంగా తనవంతు సహాయసహకారాలు అందజేయటానికి ఎల్లప్పుడూ ముందు ఉంటానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.ఎన్.ఎల్. విజయవాడలోని వివిధ శాఖలకు చెందిన డి.జి.ఎమ్‌లు, ఎ.జి.ఎమ్‌లు, సి.ఎ.వోలతో పాటు ఎస్.డి.ఈలు పాల్గొన్నారు.

# పాడిరైతుల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**●మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు**



మైలవరం (చైతన్యరథం): పాడి రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, వారు స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని శాసనసభ్యులు కృష్ణప్రసాదు బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ... పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణకు మందులు పంపిణీ, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై పాడి రైతులకు అవగాహన సదస్సులను పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు సూచించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పశుపోషకులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

# రహదారుల భద్రతా నియమాలు పాటించాలి

గుంటూరు (చైతన్యరథం): కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... మనిషి జీవితం చాలా విలువైందని, రహదారుల భద్రతా నియమాలు ప్రతిఒక్కరూ ఒక క్రమశిక్షణతో పాటించాలని, అలాగే సీట్ బెల్ట్, హెల్మెట్ పెట్టుకోటం వల్ల ఎన్నో ప్రమాదాలు నియంత్రించవచ్చన్నారు. ముఖ్యంగా యువత సేఫ్టీ రూల్స్ పాటించకపోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న మీరు ఒక అవగాహనతో జాగ్రత్తలు పాటించాలని కోరారు. రహదారిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియమాలు పపాటించి సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవాలని మన్నవ మోహనకృష్ణ కోరారు.

# ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని తిరస్కరించినా జగన్ బుద్ధి మారడం లేదు

**●అప్పులు, పెండింగ్ బకాయిలతో జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు : జీవీఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): అరాచకాలు, దుర్మార్గాలు, అవినీతి, దోపిడీ పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించినా జగన్ బుద్ధి మారడం లేదని ప్రభుత్వ చీఫ్ విప్, వినికొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నిప్పులు చెరిగారు. 2014-19 మధ్య చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి, ఆదాయం, ఉద్యోగాల కల్పనలో నెంబర్-1 నిలిపితే, జగన్ ఐదేళ్లలో పదిన్నర లక్షల కోట్లు అప్పులు, అవినీతితో అధోగతి పాల్జేశారని మండిపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్ పెట్టి పోయిన రూ.22వేల కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించామని, అయినా ఇంకా తమపై బురదజల్లాలని చూడడం దుర్మార్గామని చురకలు వేశారు. బుధవారం ఈ మేరకు వినుకొండలో మీడియా సమావేశం నిర్వహించిన చీఫ్‌విప్ జీవీ... జగన్ చేసిన అప్పులు, పెట్టిన పెండింగ్ బకాయిల గురించి వివరించారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ప్రకటించిన ప్రతిపథకం అమలు చేస్తామన్నారు. సీఎంగా చంద్రబాబు ఉన్నారుకాబట్టి జగన్ చేసిన ఆర్థిక విధ్వంసాన్ని తట్టుకుని తిరిగి సంక్షేమం, అభివృ ద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. జగన్‌కు నిజంగా సిగ్గుశరం ఉంటే.. డిగ్రీ విద్యార్థులకు రూ.2,832 కోట్లు, చిక్కీలు, కోడిగుడ్లకు రూ.256కోట్లు, వసతి దీవెనకు రూ.989 కోట్లు, ఆరోగ్యశ్రీకి రూ.1800 కోట్లు, ధాన్యానికి రూ.1600 కోట్లు, ఉద్యోగులకు రూ.20వేల కోట్లు, సాగునీటి కాంట్రాక్టర్లకు రూ.19వేల కోట్లు, గృహనిర్మాణానికి రూ.7,800 కోట్లు, ఉపాధి హామీకి రూ.2,100 కోట్లు ఎందుకు బకాయి పెట్టారని నిలదీశారు. జగన్ కేవలం తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించాడని, విధ్వంసకర ఆర్థిక విధానాలతో రాష్ట్రాన్ని రుణాల విష వలయంలోకి నెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ రుషికొండ ప్యాలెస్ కోసం రూ.వందల కోట్లు ఖర్చు పెట్టారని, సొంత పత్రిక, టీవీకి యాడ్లకు, వైసీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా టీమ్, సాక్షి ఉద్యోగులకు రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి దోచుకున్నారని, కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వలేక పోయారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పౌరసేవల సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించకుండా పస్తులు ఉండేలా చేశారని, వైసీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా సిబ్బందికి మాత్రం జీతాలు చెల్లించారని, దీనికి ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఫలితంగానే రాష్ట్ర బడ్జెట్ మొత్తమే 3 లక్షల కోట్లు అయితే జగన్ చేసిన అప్పులకు ఏడాదికి 71వేల కోట్లు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. తెచ్చిన లక్షల కోట్ల అప్పుల్లోనూ కేవలం కాగితాలపై ఖర్చులు చూపించి దారిమళ్లించు దోచుకున్నారని, అందుకే జగన్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు.

# జగన్ రూ.8 లక్షల కోట్లు దోచుకున్నాడు : శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట (చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ రూ.10 లక్షల కోట్లు మేర దోచుకున్నారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ 1.40 లక్షల కోట్లు ఉన్నాయని, ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మీడియాతో మాట్లాడుతూ... గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రియంబర్స్మెంట్ లాంటి జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూటమి ప్రభుత్వం రూ.22వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. అప్పులు కూడా పట్టని స్థితి ఏర్పడిందని, ఏడాదికి రూ.71 వేల కోట్ల అసలు, వడ్డీ చెల్లించాలని, ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్మోహన్ రెడ్డి రూ. 8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని శ్రీరాం తాతయ్య మండిపడ్డారు.



# జగన్ పాలనతో దివాళా తీసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట (చైతన్యరథం): జగన్ చేసిన అప్పులు కూటమి ప్రభుత్వానికి గుదిబండలా మారాయని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు నెట్టెం రఘురాం వ్యాఖ్యానించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్ల పరిపాలనలో 10 లక్షల కోట్ల మేరకు అప్పులు చేసిందని, ఏడాదికి రూ.71వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపు భారం కలిపి రూ. 1.40 లక్షల కోట్లుగా ఉందన్నారు. జగన్ చేసిన అప్పులు, అవినీతి అక్రమాలు నేటి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారాయని, నాటి పాలకుల తప్పులు నేటి పాలకులకు శాపంగా మారిందన్నారు. జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.1.40లక్షల కోట్లలో గడిచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు రూ.19,871.35 కోట్లు ఖర్చు చేసి తినేశారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అయిదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.8లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు, ఇలా ప్రతి దాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారని, ఆంధ్రప్రదేశ్ గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం, చివరికి చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్డులు వంటి వాటిల్లో కూడా పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం : గద్దె క్రాంతి కుమార్

విజయవాడ (చైతన్యరథం): కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ, నిరంతరం తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త గాదం ప్రసాద్‌బాబు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం టీడీపీ యువ నాయకులు 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ గులాబీ రోడ్డులో గాదం ప్రసాద్ ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశంపార్టీ, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మీకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. గాదం ప్రసాద్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతికుమార్ అందజేశారు. గద్దె క్రాంతికుమార్‌తో పాటు జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు ఉన్నారు.



# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో వసతులు

◆విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

◆తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి

◆మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి, (చైతన్యరథం) : ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు, బుధవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 92వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఎన్నో ఆశలు పెట్టుకుంటారని వారి ఆశలు నిరాశ చేయకుండా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణుల కావాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో మంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని విద్యార్థులకు ఎటువంటి అనుమానాలు ఉన్న వెంటనే అధ్యాపకులకు తెలియజేసి డౌట్ క్లియర్ చేసుకోవాలన్నారు. మన ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంసెట్ లలో మంచి ర్యాంకులు సాధించి వివిధ హోదాలలో ఉన్నారని మీరు కూడా బాగా చదివి మంచి ఉద్యోగాలు పొంది అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమానికి ముందు కళాశాల యాజమాన్యం మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఇందుకూరుపల్లెలో ....**

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాయచోటి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ప్రజలు సరైన రోడ్లు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారని నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, వేసి గ్రామాలకు కొత్త కళ వస్తుందన్నారు. గత 30 సంవత్సరాలుగా ఎగువఇందుకూరు ప్రజలు సరైన రోడ్డు లేక వాహనదారులు, పాదచారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని నేటితో ఇందుకూరు గ్రామ ప్రజల కల నెరవేరిందన్నారు. రాయచోటి మండలం దిగువ అబ్బవరం గ్రామం, దిగువపాత హరిజనవాడ నుంచి ఎగువ ఇందురు వరకు దాదాపు 49 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ జరిగిందన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

◆వార్డుల్లో విస్తృతంగా పర్యటన

◆సమస్యల గోడు వినిపించిన జనం

◆ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



మార్కాపురం, (చైతన్యరథం) ప్రజల ఇబ్బందులు తీర్చడానికే "మన ఊరు –మన ఎమ్మెల్యే " కార్యక్రమం నిర్వహిస్తున్నామని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని 9 వ వార్డులో "మన ఊరు –మన ఎమ్మెల్యే" కార్యక్రమంలో పాల్గొని వార్డులో ప్రజల ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు వార్డ్ లో డ్రైనేజ్ సమస్య అధికంగా ఉందని, చెరువును కొంతమంది కబ్జాదారులు కబ్జా చేసి ఇల్లు నిర్మించారని ఫిర్యాదు చేశారు. దానితో చెరువు కట్టపై నడవడానికి కూడా వీలు లేకుండా పోయిందని వాపోయారు. ఆర్టీసీ బస్టాండ్ లోని మరుగుదొడ్ల వ్యర్థాలు రోడ్లపైకి వస్తున్నాయని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్లు ఒక రోడ్డుపై మళ్ళీ లేయర్ వేయడంతో సిమెంట్ రోడ్డు ఎత్తు పెరిగి మురుగు కాలువల్లో ప్రవహించకుండా ఆగిపోతుందని ఈ సమస్యను అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కారం చూపుతానని అన్నారు. చెరువు కట్టను కొంతమంది కబ్జా చేసి ఇల్లు నిర్మించారని దానితో చెరువు కట్టపై నడవడానికి వీలు లేకుండా పోయిందని త్వరలోనే దీనిపై ఎంక్వయిరీ చేసి సమస్యకు పరిష్కారం చూపిస్తానని మాట ఇచ్చారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మరుగుదొడ్ల నుంచి వ్యర్థాలు రోడ్లపైకి రాకుండా పటిష్టమైన సెప్టిక్ ట్యాంకులను ఏర్పాటు చేయిస్తానని అన్నారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా తన దగ్గరకు ఎప్పుడైనా రావచ్చునని ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి సన్నిధిలో ఫిబ్రవరి 4వ తేదీన జరగబోయే శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి రథసప్తమి వేడుకల గోడ పోస్టర్‌ను కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల నాలుగో తేదీన జరగబోయే రథసప్తమి వేడుకలను రథసప్తమి కమిటీ ఆధ్వర్యంలో గతంలో కన్నా విస్తృతంగా, మిన్నగా వేడుకలను నిర్వహిస్తామని, ప్రజలందరూ సహకరించాలని కోరారు.




# చదవులతోనే భవితకు బాటలు

◆ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, (చైతన్యరథం) : కనిగిరి పట్టణంలోని షాదీ ఖానా లో బంగారు బాల్యం పై ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించి సాధికారత దిశగా బాలికలను ఎదగనిద్దాం అందుకే ప్రభుత్వం బంగారు బాల్యం కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని రూపకల్పన చేశామన్నారు. బాలల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామాల్లోని బడి బయట పిల్లలను గుర్తించి వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని, వారిని ఓపెన్ పాఠశాలలో చేర్పించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ బాల కార్మికులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, బాలికలపై లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పసి పిల్లల నవ్వులే దేశానికి వెలుగులని, వారి చదువులే నూతన బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, బంగారు బాల్యం తోనే మహోన్నత ప్రపంచం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్,ఆర్డిఓ కేశవర్ధన్ రెడ్డి, డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్, డి ఎల్ డి ఓ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీవోలు, ఎం ఈ ఓ లు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

◆వైసీపీ పాలనలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన సమస్యలు

◆అర్జీలు సమర్పించేందుకు తరలివచ్చిన ప్రజానీకం

◆ ప్రతి విన్నపాన్నీ ఆన్ లైన్ చేయించిన సోమిరెడ్డి



మనుబోలు, (చైతన్యరథం) మనుబోలు నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్న ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే వెంకటాచలం, పొదలకూరు మండలాల్లోనూ ఈ కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. ఇప్పటి వరకు ఆన్ లైన్ లో సుమారు 3 వేల వరకు అర్జీలు నమోదయ్యాయన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై సమీక్షలు నిర్వహించుకుంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. త్వరలోనే తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల్లోనూ స్పెషల్ గ్రీవెన్సులు నిర్వహిస్తామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వేలాది సమస్యలు పేరుకుపోవడం దురదృష్టకరమన్నారు. ఎక్కువ శాతం అర్జీలు పింఛన్లు రావడం లేదని, ఇళ్ల స్థలాలు లేవని, ఇళ్లు మంజూరు చేయాలని కోరడంతో పాటు భూఆక్రమణలు, భూసమస్యల గురించే వస్తున్నాయన్నారు.

**ఇక సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు**

మనుబోలులోని చేరెడ్డి రామచంద్రారెడ్డి కళ్యాణ మండపంలో మండలంలోని సచివాలయాల ఉద్యోగులతో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15 లోపు ప్రతి ఉద్యోగి ఇంటింటికీ వెళ్లి ఆధార్, రేషన్ కార్డులు లేని వారితో పాటు అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్న వారి వివరాలను సేకరించాలని ఆదేశించారు. సచివాలయ వ్యవస్థ వచ్చి ఐదేళ్లవుతున్నా, ఒక్కో సచివాలయంలో 10 మంది ఉద్యోగులుంటున్నా కనీసం ఆధార్ కార్డులు కూడా ఇప్పించలేని పరిస్థితులు ఉండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. విధినిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు కూడా నిర్లక్ష్యాన్ని వీడి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని వెల్లడించారు. సచివాలయ ఉద్యోగులను ఇబ్బందిపెట్టే ఉద్దేశం తనకు లేదన్నారు. చిన్నవయస్సులో ఉద్యోగాల్లో చేరిన వారంతా తనకు బిడ్డలతో సమానమని, బాధ్యతగా పనిచేయాలని మాత్రమే చెబుతున్నానని స్పష్టం చేశారు.

# శాంతిభద్రతల విషయంలో రాజీలేదు

◆ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

◆సీసీ కెమెరాలు ప్రారంభం




కందుకూరు, (చైతన్యరథం) : కందుకూరు పట్టణ శాంతి భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడటం జరగదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు, కందుకూరు పట్టణంలో బుధవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్, పట్టణంలోని 43 ప్రాంతాల్లో సుమారు 10లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వ్యాపార స్థావరాలు, ముఖ్యమైన మార్గాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి ప్రకటించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ ప్రజల భద్రతపై ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అనేక అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నాయి. పట్టణంలోని ముఖ్యమైన వ్యాపార ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు కీలకమని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ సి.సి కెమెరాల ఏర్పాటు కృషి చేసిన ఎమ్మెల్యే ఇంటూరిని డీఎస్పీ శాలువాతో ఘనంగా సత్కరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలు అందరిని ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, గుడ్లూరు సిఐ మంగారావు, పట్టణ ఎస్సై సాంబశివరావు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య , పార్టీ నాయకులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# పేరూరు కాలువ నిర్మాణానికి నిధులివ్వండి

- మంత్రి పయ్యావులను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్
- ఇతర ప్రాజెక్టుల నిర్మాణంపైనా చర్చ
- ముఖ్యమంత్రితో చర్చించి.. నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ



అనంతపురం (చైతన్యరథం): పేరూరు కాలువ నిర్మాణానికి 200 కోట్లు, భూసేకరణకు 51 కోట్ల రూపాయలు కేటాయించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ భేటీ అయ్యారు. బుధవారం వారు అనంతపురంలోని పయ్యావుల నివాసానికి వెళ్లి పలు అంశాలపై మంత్రితో చర్చించారు. ముందుగా ఎమ్మెల్యే సునీత అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో హంద్రీ-నీవా అధికారులతో సమావేశం నిర్వహించారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనుల పురోగతి గురించి చర్చించారు. భూసేకరణ, కాలువలు, పంపుహౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన నిధుల గురించి తెలుసుకున్నారు. సమగ్రమైన సమాచారంతో ఎమ్మెల్యే సునీతతో పాటు పరిటాల శ్రీరామ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులను కలిశారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలను మంత్రికి వివరించారు. జీఓ నెంబర్ 59 ప్రకారం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్ట్ వరకు 54 కిలోమీటర్లు కాలువ తవ్వాల్సి ఉందన్నారు. గత ఐదేళ్లలో ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. పెండింగ్ పనులు, 4 పంపు హౌస్‌ల నిర్మాణాలతో పాటు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఇందులో భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. పేరూరు ప్రాజెక్ట్ కాలువ తవ్వకం కోసం చేసిన 266 ఎకరాల భూసేకరణ పరిహారం బిల్లులు రూ.14 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లు అప్‌లోడ్ చేశారని.. నిధులు విడుదల చేయాల్సి ఉందన్నారు. కాలువ భూసేకరణ కోసం 51 కోట్లు బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీఎఫ్ఎంఎస్ పోర్టల్లో భూసేకరణ, కాలువ నిర్మాణం పనుల బిల్స్ అప్లోడ్ చేయడానికి హోల్డ్‌ను తీసివేయాలన్నారు. పేరూరు కాలువ పనులు చేపట్టడానికి 200 కోట్ల బడ్జెట్ కేటాయించి.. నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులకు సంబంధించి చర్చించారు. కాలువ లైనింగ్ పనులపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని.. వీటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. లైనింగ్ బదులు కాలువ వెడల్పు చేయాలని రైతులు కోరుతున్నట్టు వివరించారు. తప్పనిసరి పరిస్థితుల్లో లైనింగ్ చేయాల్సి వస్తే... కాలువ గట్లకు ఇరు వైపులా చేసి... కింది భాగం వదిలేయాలన్నారు. అలాగే ననసకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో బాలికల జూనియర్ కాలేజీ మంజూరుకు ఫైనాన్షియల్ క్లియరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ చెప్పిన అన్ని అంశాలపై మంత్రి పయ్యావుల సానుకూలంగా స్పందించారు. సీఎం చంద్రబాబుతో పాటు సంబంధిత అధికారులతో వీటిపై చర్చించి త్వరలోనే సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### తాగునీటి సమస్య రానివ్వొద్దు: ఎమ్మెల్యే సునీత

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో శ్రీ సత్యసాయి జిల్లా ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో తాగునీటి సరఫరా గురించి చర్చించారు. ఈ మూడు మండలాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉందా అని ఆరా తీశారు. అయితే అధికారులు ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. అక్కడ గ్రామస్థుల అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బోర్లలో నీరు తగ్గితే.. వాటిని మరింత లోతుగా తవ్వే విధంగా చూస్తామన్నారు. రైతుల పొలాల నుంచి సరఫరా చేసే మార్గాలను కూడా పరిశీలిస్తున్నట్టు వివరించారు. ముందు జాగ్రత్తగా ఇప్పటి నుంచి తాగునీటి గురించి దృష్టి సారించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ప్రతి రోజు సమస్యాత్మక ప్రాంతాల్లో పరిస్థితి ఏంటన్నది చూడాలన్నారు. మరోవైపు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి ఈ మూడు మండలాల పరిధిలో ఇంటింటికీ తాగునీరు అందించే పథకం గురించి ఆరా తీశారు. రూ.340కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్రమైన ప్రణాళిక ఉండాలన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతానికి తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత తెలిపారు. ప్రజలకు ఎక్కడ ఏ ఇబ్బంది ఉన్నా.. అధికారులు స్పందించాలని ఆమె తెలిపారు.

# జగన్ పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పు

- ఇప్పుడు ఏడాదికి రూ. 71 వేల కోట్ల అసలు, వడ్డీ చెల్లింపు భారం
- అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ




అనంతపురం (చైతన్యరథం): జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి, ఇష్టానుసారం అప్పులు చేసుకుంటూ రూ. 10 లక్షల కోట్లకుపైగా అప్పులను రాష్ట్రంపై గుదిబండలా వేసి వెళ్లాడని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం సంయుక్తంగా వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. జగన్‌రెడ్డి నిర్వాకంతో ఇప్పుడు అప్పులు కూడ పుట్టని స్థితి ఏర్పడిందని అన్నారు. ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇలాంటివి ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి గుదిబండలా మారిందన్నారు. ఈ సందర్భంగా వారు జగన్ పెట్టిన బకాయిలను వివరించారు. డిగ్రీ ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు - రూ. 2,832 కోట్లు, ఫీజు రీయంబర్స్ మెంట్ - రూ. 450 కోట్లు, చిక్కిలు, కోడిగుడ్లకు రూ. 256 కోట్లు, వసతి దీవెన - రూ. 969 కోట్లు, ఆరోగ్య శ్రీ బకాయిలు - రూ.1800 కోట్లు, ధాన్యం బకాయిలు - రూ.1600 కోట్లు, ఉద్యోగులకు బకాయిలు - రూ. 20,000 కోట్లు, ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు - రూ. 19,000 కోట్లు, గృహ నిర్మాణం బకాయిలు - రూ. 7,800 కోట్లు, ఉపాధి హామీ బకాయిలు - రూ.2,100 కోట్లు. ఇలా మొత్తం జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయి రూ.1.40 లక్షల కోట్లు ఉన్నాయని వారు వివరించారు. ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదన్నారు.

తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలకు ఖర్చు చేసి తినేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని వారు మండిపడ్డారు. ముఖ్యంగా జగన్ రెడ్డి విలాసాలు, జల్సాలకు ప్రభుత్వ ధనం దుబారా రూ.19,871.35 కోట్లు చేసి రికార్డులు సృష్టించాడని అన్నారు. జగన్ రెడ్డి కుటుంబ లూటీ రూ.8 లక్షల కోట్లు అని అన్నారు. గత అయిదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని అన్నారు.

# చింతలాంపల్లిలో చిచ్చు వైసీపీ కుట్రే

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు

అనంతపురం (చైతన్యరథం): గుంతకల్ మండలం చింతలాంపల్లిలో జరిగిన కుట్ర వైసీపీ హయాంలో నేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. బుధవారం అనంతపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 14 సెంట్ల స్థలాన్ని బలవంతంగా కొందరి సహాయంతో కాజేశారని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడటంలో వాస్తవాలు నిగ్గు తేల్చి న్యాయం చేయాలని అధికారులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశించారని తెలిపారు. దీంతో ఎక్కడ మీ బండారం బయటపడుతుందో నని డ్రామాలు చేసింది మీవాళ్ళే గదా? మీకు తెలియదా అని ఆయన నిలదీశారు. పోలీసులు ఎక్కడా మీరు చెప్పినట్టు ఇష్టానుసారం విధులు నిర్వహించడం లేదని, మీ




హయాంలో జరిగినట్టు.. ఇప్పుడు జరగకపోయినా జరుగుతున్నట్టు గగ్గోలు పెడతారా అని ప్రశ్నించారు. పోలీసులు ఎలాంటి ఒత్తిడులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. చేసిన తప్పులు బయటపడి పోతాయనే వైసీపీ నాయకులు ఈ డ్రామాలు చేస్తున్నారని అన్నారు. ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో పోలీసులు స్వేచ్ఛగా విధులు నిర్వహిస్తున్నారని, ఎక్కడా వారిపై ఒత్తిడులు లేకుండా ఇప్పుడు పనిచేస్తున్నారని అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు.



వేల్పనూరులో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

# విద్యార్థులను చదువుల పేరుతో ఒత్తిడి చేయవద్దు

- చదువుతో పాటు క్రీడలూ అంతే ముఖ్యం
- హాకీ పోటీల ముగింపు కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్

ధర్మవరం (చైతన్యరథం): విద్యార్థులను చదువులు, ర్యాంకులు, ఉద్యోగాల పేరుతో తల్లిదండ్రులు ఒత్తిళ్లకు గురి చేయవద్దని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. ఆర్డీటీ మైదానంలో అంతర్ జిల్లా జూనియర్ ఉమెన్ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిసాయి. ఆర్డీటీ డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ పేరుతో నిర్వహించిన ఈ పోటీలు 13వసారి కావడం విశేషం. ఈ పోటీల్లో మొత్తం 17 జట్లు పాల్గొంటే.. నాలుగు జట్లు సెమీ ఫైనల్స్‌కి వచ్చాయి. ఫైనల్ పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా విజేతగా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్ విజేతలను అభినందించారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ గత 20ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయం అన్నారు. కేవలం హాకీ మాత్రమే కాకుండా గత మూడు దశాబ్దాలుగా ఎంతో మంది క్రీడాకారులను అందించిందన్నారు. తల్లిదండ్రుల ఆలోచన విధానంలో చాలా మార్పులు రావాలని.. పిల్లలకు చదువులతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమన్నారు. క్రీడల్లో పాల్గొంటే శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. అది చదువుకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పుడు ఓడిపోయినవారు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. మొత్తం 17 జట్లు పాల్గొంటే.. టాప్-4కి రావడం అంత ఈజీ కాదన్నారు. మీరు క్రీడల్లో చూపిన పోరాట స్ఫూర్తిని జీవితంలో కూడా చూపించాలని అన్నారు. అలాగే జీవితంలో పది మందికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఇలాంటి అవకాశాలను కల్పిస్తున్న ఆర్డీటీ సంస్థ భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు.



# మహా కుంభమేళాలో తీవ్ర విషాదం



◆తొక్కిసలాటలో 30 మంది మృతి, 36 మందికి గాయాలు

◆దుర్ఘటనపై పీఎం మోదీ ఆరా

◆బారికేడ్లను తొలగించడం వల్లే తొక్కిసలాట : మహా కుంభమేళా డీఐజీ



ప్రయాగ్‌రాజ్: మహా కుంభమేళాలో తీవ్ర విషాద సంఘటన చోటుచేసుకున్నది. మౌని అమావాస్య సందర్భంగా అమృత స్నానం చేయడానికి లక్షల సంఖ్యలో భక్తులు త్రివేణి సంగమం చేరుకున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 30 మంది మృతి చెందగా, 36 మంది గాయపడ్డారు. ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూపరాణి ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

మహాకుంభ్ పరిస్థితిపై ప్రధాని మోదీ.. యూపీ సీఎం యోగితో మాట్లాడారు. ఇప్పటికే పలుమార్లు మాట్లాడిన ప్రధాని అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ప్రధాని ఆదేశించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యల్ని ఆయన సూచిస్తున్నారు.

త్రివేణి సంగమంలో తొక్కిసలాట జరిగిన ప్రదేశానికి ఉదయం సుమారు 70 అంబులెన్సులు చేరుకున్నాయి. దాదాపు మూడు గంటల పాటు తరలింపు ప్రక్రియ జరిగింది. అమావాస్య రోజున స్నానం చేయాలన్న ఉద్దేశంతో.. కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ ఇప్పటికే యూపీ సీఎంకు పలుసార్లు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. దీంతోపాటు ఈ ఘటనలో గాయపడిన వారికి తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియా వేదికగా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. "ప్రయాగ్‌రాజ్ ప్రమాదం చాలా బాధాకరం. ఈ ఘటనలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన భక్తులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. దీంతో పాటు గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. బాధితులకు సాధ్యమైనంత సహాయం అందించడంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమై ఉంది. ఈ విషయంలో నేను ముఖ్యమంత్రి యోగి జీతో మాట్లాడాను, రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదిస్తున్నాను."

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం

ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌లో జరిగిన తొక్కిసలాట సంఘటన చాలా బాధాకరం. మరణించిన భక్తుల కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన భక్తులందరూ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

### ఒకేరోజు 6 కోట్లకు పైగా భక్తులు

మహా కుంభమేళాకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మౌని అమావాస్య ప్రభావంతో భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. బుధవారం ఒక్కరోజే సాయంత్రం నాలుగు గంటల వరకే ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో అమృతస్నానాలు చేసిన భక్తుల సంఖ్య 6 కోట్లు దాటింది. దాంతో త్రివేణి సంగమంలోని ఘాట్‌లు అన్ని కిటకిటలాడుతున్నాయి. ఇవాళ మొత్తంగా కుంభమేళాకు వచ్చే భక్తుల సంఖ్య 8 కోట్లు దాటవచ్చునని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

అయితే మౌని అమావాస్య సందర్భంగా మహా కుంభమేళాకు భక్తుల తాకిడి భారీగా పెరగడంతో బుధవారం ఉదయం తీర్థరాజ్ సంగం తీరంలో తొక్కిసలాట జరిగింది. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని తగ్గించేందుకు యూపీ సీఎం ఒక ప్రకటన చేశారు. మౌనీ అమావాస్య సందర్భంగా పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు త్రివేణి సంగమానికి తరలి రావాల్సిన అవసరం లేదని, వారివారి సమీప ఘాట్‌లలో స్నానాలు చేసినా సరిపోతుందని చెప్పారు. అయినా భక్తుల తాకిడి ఏమాత్రం తగ్గలేదు. ప్రవాహంలా త్రివేణి సంగమానికి తరలివస్తూనే ఉన్నారు. మౌని అమావాస్య నేపథ్యంలో పలువురు సాధువులు, యోగులు కూడా భారీ సంఖ్యలో అమృత స్నానాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సాధువులు, యోగులపై యూపీ ప్రభుత్వం హెలికాప్టర్‌లతో ఆకాశం నుంచి పూలు చల్లించింది.

### బారికేడ్లను తొలగించడంవల్లే తొక్కిసలాట : మహా కుంభమేళా డీఐజీ

మహా కుంభమేళా తొక్కిసలాటలో మొత్తం 30 మంది మరణించారని ఉత్తరప్రదేశ్ పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన వివరాలను మహా కుంభమేళా డీఐజీ వైభవ్ కృష్ణ మీడియాకు వెల్లడించారు. తొక్కిసలాటలో మొత్తం మరణాల సంఖ్య 30కి పెరిగిందని, మరో 36 మంది గాయాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు. మృతుల్లో 25 మందిని గుర్తించామని, మరో ఐదుగురు ఏ ప్రాంతానికి చెందినవారో గుర్తించాల్సి ఉందని డీఐజీ చెప్పారు. బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట రెండు గంటల మధ్య తొక్కిసలాట జరిగిందని ఆయన వెల్లడించారు. మౌని అమావాస్య నేపథ్యంలో భక్తులు ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో పుణ్యస్నానాలకు తరలివచ్చారని అన్నారు. ఒక్కసారిగా రద్దీ పెరగడంతో పలుచోట్ల బారికేడ్లను తొలగించారని, అదే తొక్కిసలాటకు దారితీసిందని వైభవ్ కృష్ణ తెలిపారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ దగ్గర త్రివేణి సంగమంలో ఈ నెల 13న మహా కుంభమేళా ప్రారంభమైంది. ఫిబ్రవరి వరకు ఈ మహా కుంభమేళా కొనసాగనుంది. మహా కుంభమేళా 144 ఏళ్లకు ఒకసారి మాత్రమే వస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మహా కుంభమేళాకు భక్తులు అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ నెల 28 వరకు అంటే కేవలం 16 రోజుల్లోనే 19.94 కోట్ల మంది ఈ కుంభమేళాలో పాల్గొన్నారు.

# నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 15

◆ఇస్రో వందో ప్రయోగం విజయవంతం

◆ప్రముఖుల హర్షం



శ్రీహరికోట: శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వీ రాకెట్-15 నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని రోదసిలోకి తీసుకెళ్లింది. దీంతో ఇస్రో వందో ప్రయోగం విజయవంతమైంది.

భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు (నావిగేషన్, ముఖ్యంగా నౌకాయానం) అందిస్తుంది. 50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లిన 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను యూఆర్ శాటిలైట్ కేంద్రంలో రూపొందించి అభివృద్ధి పరిచారు. ఇందులో రేజింగ్ పేలోడ్‌కు అదనంగా ఎల్1, ఎల్5 నావిగేషన్ పేలోడ్లు ఉన్నాయి. ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు, ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలిపింది.

### 46 ఏళ్లలో 99 ప్రయోగాలు

భారత్ తన మొదటి పెద్ద ఉపగ్రహాన్ని 1970, ఆగస్టు 10న శ్రీహరికోట నుంచి ప్రయోగించింది. ఇస్రో 99 ప్రయోగాలు చేయడానికి 46 ఏళ్ల సుదీర్ఘకాలం పట్టింది. ఇప్పటివరకు ఇస్రో సాధించిన ప్రగతి వెనుక పలు తరాల శాస్త్రవేత్తల కృషి ఉన్నదని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం సంచాలకులు రాజరాజన్ మీడియాకు తెలిపారు.

# రూ.16,300 కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్

◆కేంద్రం ఆమోదం

◆అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ: నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రూ.16,300 కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం ప్రకటించింది. కీలక ఖనిజాల అంశంలో స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేస్తూ.. కీలక ఖనిజాల దిగుమతిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. కీలక ఖనిజాల ఉత్పత్తికి త్వరగా అనుమతులు ఇస్తామని కేంద్రం తెలిపింది. ఖనిజాలు వెలికితీసే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఖనిజాల కోసం అన్వేషణ, కొత్త బ్లాక్‌లను కొనుగోలు చేయడం, క్లిష్టమైన ఖనిజ మైనింగ్ ప్రాజెక్టుల కోసం ఫాస్ట్‌ట్రాక్ ఆమోద ప్రక్రియను రూపొందించడం తదితర లక్ష్యాలను ఈ మిషన్ పర్యవేక్షించనున్నది. మిషన్ అన్వేషణకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తుంది. అధిక భారం, టైలింగ్ నుంచి ఈ ఖనిజాల పునరుద్ధరణ మిషన్ ప్రోత్సహిస్తుంది. పీఎస్‌యూలు, ప్రైవేటు రంగ సంస్థలను విదేశాల్లో కీలకమైన ఖనిజ ఆస్తులను పొందేలా ప్రోత్సహించడం, వనరులు అధికంగా ఉన్న దేశాల్లో వాణిజ్యాన్ని పెంచడం ఈ మిషన్ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. భారతదేశంలో కీలకమైన ఖనిజాల నిల్వను అభివృద్ధి చేయాలని కూడా మిషన్ యోచిస్తోంది.

ఈ సందర్భంగా కేంద్రం ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ ప్రోగ్రామ్ కింద ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఇథనాల్ కొనుగోలు చేసే విధానానికి సైతం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇథనాల్ స్లపయ్ ఇయర్ 2024-25 కోసం ప్రభుత్వ రంగ ఓఎంసీఎస్ సరఫరా కోసం ఇథనాల్ ధరలను సవరించింది. నవంబర్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే ఇథనాల్ సప్లయ్ ఇయర్ 2024-25 కోసం ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీల కోసం ఇథనాల్ సేకరణ ధరను సవరించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ ప్రోగ్రామ్ కింద 2024 నుంచి 31 అక్టోబర్ 2025 వరకు.. 2024-25 ఇథనాల్ సప్లయ్ ఇయర్ (1 నవంబర్ 2024 నుంచి 31 అక్టోబర్ 2025 వరకు) వరకు సీ కేటగిరి హెవీ మొలాసిస్ నుంచి ఉత్పత్తి చేయబడిన ఇథనాల్ ఎక్స్-మిల్ ధరను లీటరుకు రూ.56.28 నుండి రూ.57.97కి పెంచడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

# ఢిల్లీలో బీజేపీ విజయం ఖాయం

◆ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ధీమా

న్యూఢిల్లీ: ఈసారి ఎన్నికల్లో ఆప్ పని అయిపోతుందని, బీజేపీ విజయం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఘోండా నియోజకవర్గం లో బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని చెప్పారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో ఆప్ సర్కారు పోయి, బీజేపీ సర్కారు వస్తుందని జోస్యం చెప్పారు. ఈ మాట తాను మాత్రమే చెప్పడం లేదని యావత్ ఢిల్లీ ప్రజలంతా అదే అంటున్నారని అన్నారు.

ఢిల్లీ ప్రజలు ఇంటింటికి నల్లా నీళ్లు కావాలని, ట్యాంకర్ మాఫియా నుంచి విముక్తి కల్పించాలని కోరుకుంటున్నారని ప్రధాని చెప్పారు. గత 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ వారి ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఆప్ అబద్ధపు హామీలను ఇప్పుడు ఢిల్లీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వారంతా డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఈ సభకు హాజరైన జన సంఖ్యే చెబుతోందని అన్నారు. ఢిల్లీ బీజేపీ విడుదల చేసిన మ్యానిఫెస్టోను ప్రధాని మెచ్చుకున్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించేలా మ్యానిఫెస్టో ఉందని అన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాల్లో కోత..

◆20 లక్షల మందికి ఈమెయిల్

◆అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడు

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ట్రంప్ సర్కారు బైఅవుట్‌ను ప్రకటించింది. ఈమేరకు ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి ఒక మెమో వెలువడింది. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమాణాలు, ప్రవర్తన, అనుకూలతలను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఒక ఈమెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు వెళ్లింది. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోపు ఓ నిర్ణయానికి రావాలని దానిలో వెల్లడించారు. ఉద్యోగాలు మానేద్దామని అనుకొని ఆగిపోయినవారు దీనిని ఎంచుకోవచ్చు. కొవిడ్ తర్వాత చాలామంది ఉద్యోగులు రిమోట్ విధానంలో పని చేస్తున్నారు. తాజాగా వారు వారానికి ఐదు రోజులు ఆఫీసులకు రావాలని ట్రంప్ సర్కారు తేల్చి చెప్పింది.

ఈ కార్యాలయాల్లో విధులకు హాజరుకావడం ఇష్టం లేని ఉద్యోగులు దీనిని ఎంచుకోవచ్చని చెబుతున్నారు. సుమారు 10-15 శాతం మంది దీనిని ఎంచుకోవచ్చని భావిస్తున్నారు. ఇది విజయవంతంగా అమలైతే అమెరికా ప్రభుత్వ ఖర్చులు ఏటా 100 బిలియన్ డాలర్ల వరకు తగ్గవచ్చని భావిస్తున్నారు. ఓవైపు ఫెడరల్ నిధులు, రుణాలను నిలిపివేసిన వేళ ఈ వార్త బయటకు రావడం



చర్చనీయాంశంగా మారింది. చాలా స్థానిక సంస్థల ప్రభుత్వాలు, నాన్ ప్రాఫిట్ సంస్థలపై దీని ప్రభావం ఉండనుంది.

గతేడాది చివరికి అమెరికాలో దాదాపు 30 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దేశం మొత్తం ఉద్యోగుల్లో ఇది 1.9 శాతానికి సమానం. ప్యూ రీసెర్చి సెంటర్ లెక్కల ప్రకారం ఒక్కో ప్రభుత్వ ఉద్యోగి సగటున 12 ఏళ్లపాటు పని చేస్తాడు, తాజాగా ట్రంప్ ఆఫర్ కొద్ది శాతం మంది ఆమోదించినా.. అది ప్రభుత్వ పాలన, ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అనుభవం ఉన్న ఫుడ్‌ఇన్స్పెక్టర్లు, నీటి పరీక్షల విభాగం, వైమానిక రంగం, నిత్యావసర వస్తువుల రక్షణకు సంబంధించిన ఉద్యోగుల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నారు. మరోవైపు అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు ఎవరెట్ కెల్లీ మాట్లాడుతూ దీనిని వాలంటరీ బైఅవుట్‌గానే చూడాలన్నారు.

# చర్చలకు భయపడుతున్న పుతిన్

◆ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీఎద్దేవా



మూడేళ్లుగా ఉక్రెయిన్- రష్యాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో యుద్ధం ముగింపుపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో చర్చలను రష్యా అధ్యక్షుడు పుతిన్ తోసిపుచ్చారు. దీనిపై జెలెన్ స్కీ స్పందిస్తూ బలమైన నాయకులన్నా.. చర్చలన్నా పుతిన్‌కు భయమని తేలిపోయిందని వ్యాఖ్యానించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

'బలమైన నాయకులకు, చర్చలకు పుతిన్ భయపడతారని మరోసారి తేలిపోయింది. యుద్ధాన్ని పొడిగించడానికి ఆయన సాధ్యమైనంత ప్రయత్నం చేస్తున్నారు.. ఆయన వేసే ప్రతి కదలిక, ఎత్తుగడలు అన్నీ యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసేవిగా ఉంటాయి. 2014లో రష్యా మాకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రారంభించింది. 2022లో అది పూర్తిస్థాయి దండయాత్రగా మారింది. ప్రస్తుతం శాంతిని సాధించే అవకాశం ఉన్నప్పటికీ.. ఆయన ఆ దిశగా ప్రయత్నించడం లేదు.

ప్రపంచంలో స్థిరత్వానికి భంగం కలిగించేందుకు ఆయన వద్ద సామర్థ్యాలు నిండుగా ఉన్నాయి. కానీ, బలమైన నాయకుల నుంచి వచ్చే ఒత్తిడిని తట్టుకోలేనంత బలహీనంగా ఉన్నారు. అందుకే మనం నిర్ణయాత్మకంగా, ఐక్యతతో వ్యవహరించాలి. శాంతిని విశ్వసించే వారంతా కలిసి రష్యాపై ఒత్తిడి పెంచాలి. అప్పుడే మనం నిజమైన శాంతిని సాధించగలం' అని జెలెన్‌స్కీ రాసుకొచ్చారు.

**జెలెన్ స్కీతో చర్చలు సాగవు..**

రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య శాంతిని నెలకొల్పే చర్చలు సాధ్యమేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. అయితే, జెలెన్ స్కీతో ఇది కుదరదని వ్యాఖ్యానించారు. 'చర్చలు జరిపి, రాజీ పడాలనే కోరిక ఉంటే అందుకు మేము సిద్ధం. కానీ, ఆ దేశాధ్యక్షుడితో మాత్రం చర్చలు సాగవు. మా ప్రయోజనాలకు అనుగుణంగానే ప్రయత్నాలుంటాయి. పాశ్చాత్య దేశాలు కీవ్‌కు మద్దతు నిలిపివేస్తే ఈ పోరాటం రెండు నెలల్లోనే ముగిసిపోతుంది' అని పుతిన్ తెలిపారు.

దాదాపు మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇటీవల ఆయన మాట్లాడుతూ యుద్ధం అనేది అసలు మొదలుకాకూడదని.. తాను అధ్యక్షుడిగా ఉంటే ఉక్రెయిన్‌లో సంక్షోభం వచ్చేది కాదన్నారు. త్వరలోనే దీనికి ముగింపు పలుకుతానని హామీ ఇచ్చారు. శాంతి చర్చలకు ఇరు దేశాధ్యక్షులు ముందుకురావాలన్నారు. అయితే, కీవ్‌లో శాంతి ఒప్పందంపై చర్చలకు రష్యా రాకపోతే వారిపై ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు.

# గాజాలో కండోమ్స్ పంపిణీకి నిధుల నిలిపివేత

◆ అమెరికా అధ్యక్షుడు

డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం



వాషింగ్టన్: అనవసర ఖర్చులు తగ్గిస్తానంటూ చెబుతోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దానికి తగ్గట్టుగానే చర్యలు తీసుకుంటున్నారు. జో బైడెన్ హయాంలో తీసుకున్న పలు నిర్ణయాలను నిలిపేస్తున్నారు. ఈ క్రమంలో దుబారా ఖర్చులను అరికడతామంటూ ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ తాజాగా ఓ విషయాన్ని గుర్తించింది. గాజాలో కండోమ్స్ పంపిణీకి బైడెన్ ప్రభుత్వం 50 మిలియన్ డాలర్లను కేటాయించినట్లు గుర్తించింది. ఈ విషయాన్ని వైట్ హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ వెల్లడించారు. అయితే అందుకు తగిన ఆధారాలను మాత్రం వెల్లడించలేదు. కాగా ఈ విషయం తన దృష్టికి రాగానే గత ప్రభుత్వ నిర్ణయాన్ని నిలిపివేశామన్నారు.

గత 15 నెలలుగా ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ కండోమ్స్‌లో ప్రమాదకర వాయువులు నింపి హమాస్ ఆయుధాలుగా ఉపయోగిస్తోందని పలు కథనాలు వెల్లడయ్యాయి. అలాగే పెద్ద సైజు కండోమ్స్‌ను 'మాగ్నమ్' కంపెనీ నుంచే ఎందుకు కొనుగోలు చేశారని ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అయితే ఈ ఆరోపణలను బైడెన్ ప్రభుత్వంలో పనిచేసిన ఆండ్రూ మిల్లర్ అనే అధికారి తోసిపుచ్చారు. ఇవన్నీ వింత ఆరోపణలని ఖండించారు. ఆ నిధులను లైంగిక ఆరోగ్యం, గైనకాలజీ, ఇతర సేవల కోసం కూడా కేటాయించారని పేర్కొన్నారు. ఇటీవలే ఇజ్రాయెల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. 42 రోజుల తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందంలో తమ చెరలో ఉన్న 94 మంది బందీల్లో 33 మందికి హమాస్ స్వేచ్ఛ కల్పించనుంది. ప్రతిగా దాదాపు 1700 మందికి పైగా పాలస్తీనీయులకు తమ జైళ్ల నుంచి ఇజ్రాయెల్ విడుదల చేయనుంది.

## సౌదీలో రోడ్డు ప్రమాదం..

# 9 మంది భారతీయుల దుర్మరణం

జెడ్డా: సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు జెడ్డాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మృతుల కుటుంబ సభ్యులతో పాటు భారత్‌లోని అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నామని.. వారికి పూర్తి సహకారం అందిస్తున్నట్లు 'ఎక్స్'లో తెలిపింది. అయితే, ఈ ప్రమాదం ఎలా జరిగింది? మృతులు ఏయే ప్రాంతాలకు చెందినవారనే వివరాలు మాత్రం తెలియలేదు.

"సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 9 మంది భారతీయులు మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. బాధిత కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ పూర్తి సహకారం అందిస్తోంది. ఈ ఘటనలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. మరోవైపు, ఈ విషాద ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పందించారు. ప్రమాదంలో భారత పౌరుల మరణవార్త తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలతో సంప్రదింపులు జరుపుతోన్న జెడ్డాలోని భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



# జపాన్‌లో అణుదాడికి 80 ఏళ్లు!

◆అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆహ్వానం

టోక్యో: హిరోషిమా, నాగసాకిపై అణుదాడి జరిగి 80 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను జపాన్ ఆహ్వానించింది. ఈ మేరకు ఆ రెండు నగరాల మేయర్లు సంయుక్తంగా ఓ లేఖను రాశారు. "ట్రంప్ స్వయంగా అణుబాంబు బాధితుల అనుభవాలను తెలుసుకోవాలి, శాంతి కోసం వారు పడుతున్న ఆరాటాన్ని అర్థం చేసుకోండి. అణ్వాయుధాల అమానవీయతపై అవగాహన పెంచుకోండి. ఈ ఆయుధాల నిషేధం దిశగా అడుగులు వేస్తారని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు.

అమెరికా 1945వ సంవత్సరం ఆగస్టు 6, 9వ తేదీల్లో హిరోషిమా, నాగసాకి నగరాలపై అణ్వాయుధాలతో దాడులు చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులకే రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ లొంగిపోయింది. హిరోషిమాలో 1 లక్ష 40 వేల మంది, నాగసాకిలో 74 వేల మంది దుర్మరణం పాలయ్యారు. నాడు గాయాలతో బయటపడిన వారు కూడా ఆ తర్వాత రేడియేషన్ ప్రభావంతో చనిపోయారు.

ఈ బాంబు దాడులకు సంబంధించి అమెరికా ఏనాడు క్షమాపణలు చెప్పలేదు. కానీ, 2010లో తొలిసారి అమెరికా రాయబారి జాన్రూస్ మాత్రం హిరోషిమాలో జరిగిన సంస్మరణ కార్యక్రమానికి హాజరయ్యారు. 2016లో నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా హిరోషిమాను సందర్శించారు. ఆ నగరానికి వచ్చిన తొలి అమెరికా అధ్యక్షుడిగా నిలిచారు. ఆ తర్వాత 2023లో జోబైడెన్ పర్యటించారు. ట్రంప్ మాత్రం తన తొలి విడత పాలనలో ఆ నగరాలకు వెళ్లలేదు. గతేడాది మాత్రం 'గాజా నిరసనలు' ఎదురవుతాయన్న భయాలతో అమెరికా, ఇజ్రాయెల్, బ్రిటన్ దౌత్యవేత్తలు హాజరుకాలేదు.

# వ్యోమగాములను త్వరగా భూమికి తీసుకురావాలి

◆మస్క్ సాయం కోరిన ట్రంప్

వాషింగ్టన్: వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ వారం రోజుల మిషన్ కోసం వెళ్లి సాంకేతిక సమస్యల కారణంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అయితే వారిని సురక్షితంగా తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు స్పేస్ ఎక్స్ అధినేత, టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌ను సాయం కోరారు.



అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు సహాయం చేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనను కోరినట్లు మస్క్ తాజాగా తెలిపారు. సాంకేతిక సమస్యల కారణంగా నెలలుగా ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయిన వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు గత బైడెన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదని విమర్శించారు. బైడెన్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వ్యోమగాములు నెలలుగా ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోవాల్సి వచ్చిందన్నారు. వారు అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఆ ఇద్దరు వ్యోమగాములను తిరిగి భూమికి తీసుకొచ్చేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నట్లు మస్క్ వెల్లడించారు. ఇందుకోసం ట్రంప్ స్పేస్‌ఎక్స్ సాయం కోరినట్లు చెప్పారు. అధ్యక్షుడి అభ్యర్థన మేరకు త్వరలో ఆ పని పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఎలాన్ మస్క్ తెలిపారు.




ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి తిలక్ వర్మ..

# తొలిసారిగా టాప్-5కి వరుణ్ చక్రవర్తి

ఇంగ్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టీ20లో ఐదు వికెట్లు పడగొట్టిన భారత జట్టు లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ టీ20 ఇంటర్నేషనల్ ర్యాంకింగ్స్‌లో టాప్-5కి చేరుకున్నాడు. ఏకంగా 25 స్థానాలు ఎగబాకి తొలిసారిగా ఐదో ప్లేస్‌కి చేరుకున్నాడు. అదే సమయంలో భారత స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ని అధిగమించాడు. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

***ఆ ఘనత సాధించిన మూడో భారత బౌలర్..***

ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి బంతితో అద్భుత ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో రెండోసారి ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. దాంతో టీ20ల్లో భారత్ తరఫున ఒకటి కంటే ఎక్కువసార్లు ఐదు లేదంటే అంతకన్నా ఎక్కువ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. ఇంతకు ముందు భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్ ఈ ఘనత సాధించారు. 2018లో దక్షిణాఫ్రికా, 2022లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టీ20ల్లో భువనేశ్వర్ ఐదు వికెట్లు తీశాడు. 2018లో ఇంగ్లాండ్, 2023లో దక్షిణాఫ్రికాపై కుల్దీప్ యాదవ్ వికెట్లు పడగొట్టాడు. వరుణ్ గతేడాది దక్షిణాఫ్రికాలో 17 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు కూల్చాడు.

***అగ్రస్థానానికి ఆదిల్ రషీద్***

ఇంగ్లాండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ భారత్‌తో జరుగుతున్న సిరీస్‌లో బంతితో రాణించాడు. దాంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. రషీద్ 2023లోనూ అగ్రస్థానానికి చేరుకోగా.. తాజాగా వెస్టిండీస్ బౌలర్ అకీల్ హుస్సేన్‌ని అధిగమించి అగ్రస్థానానికి చేరాడు. 718 రేటింగ్ పాయింట్లు రషీద్ ఖాతాలో ఉన్నాయి. అకిల్ హుస్సేన్ రెండో స్థానంలో ఉండగా.. శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటి వరకు ఇంగ్లాండ్‌తో ఆడిన మూడు మ్యాచుల్లో 108 పరుగులు చేశాడు. ఇందులో ఓ హాఫ్ సెంచరీ ఉన్నది. దాంతో కెరియర్‌లో తొలిసారిగా ఐసీసీ ర్యాకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. 832 పాయింట్లతో బ్యాటర్స్ ర్యాకింగ్‌లో రెండో స్థానానికి చేరాడు. ఇక ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ 855 పాయింట్లతో నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు.

***ఆల్ రౌండర్లలో పాండ్యా హవా..***

ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా జోరు కొనసాగుతున్నది. ప్రస్తుతం పాండ్యా నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. 255 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఆక్రమించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఇప్పటి వరకు 50 పరుగులు చేయడంతో పాటు ఐదు వికెట్లు తీశాడు. అదే సమయంలో అక్షర్ పటేల్ టాప్-12లో కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు 17 పరుగులు చేసి ఐదు వికెట్లు తీశాడు.

# భారత్ తరపున బరిలోకి సచిన్ తెందూల్కర్

భారత క్రికెట్ అభిమానులకు పండగలాంటి వార్త. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెందూల్కర్‌ని బ్యాటర్‌గానే కాదు కెప్టెన్‌గానూ చూసే అరుదైన అవకాశం వచ్చింది. తాజాగా ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ తొలి సీజన్ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కి సచిన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2025 ఫిబ్రవరి 22న భారత్- శ్రీలంక మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానుంది.




ఈ లీగ్ గురించి సచిన్ తెందూల్కర్ తాజాగా మాట్లాడాడు. 'IML క్రికెట్ ప్రత్యేకమైన, శాశ్వతమైన వారసత్వానికి సెలబ్రేషన్ లాంటిది. లీగ్‌లో నా సమకాలీనులతో కలిసి మైదానంలోకి అడుగు పెట్టడానికి ఎదురుచూస్తున్నాను. అన్ని జట్లు గెలుపుకోసం కష్టపడతాయి. టోర్నీలో పోటీ తీవ్రంగా ఉంటుంది' అని సచిన్ తెలిపాడు.

కాగా, ఈ టోర్నీలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్ వంటి టాప్ టీమ్‌లు తలపడబోతున్నాయి. ఆయా జట్లకు ఆల్‌టైమ్ లెజెండరీ క్రికెటర్లు కెప్టెన్‌లుగా వ్యవహరించనున్నారు. వెస్టిండీస్‌కి బ్రియాన్ లారా, శ్రీలంకకి కుమార సంగక్కర సారథ్యం వహిస్తున్నారు. ఆస్ట్రేలియాని షేన్ వాట్సన్, ఇంగ్లాండ్‌కి ఇయాన్ మోర్గాన్ నడిపించనుండగా, దక్షిణాఫ్రికాకు జాక్వెస్ కల్లిస్ కెప్టెన్సీ చేయనున్నాడు.

'మాజీ క్రికెటర్లకు ఇది ఒక అద్భుతమైన అవకాశం. ఒకప్పటి పోటీతత్వాన్ని చూపేందుకు, అభిమానులతో మళ్లీ కనెక్ట్ కావడానికి ఇది గొప్ప వేదిక. చాలా మంది ప్రముఖులతో కలిసి ఈ చరిత్రాత్మక లీగ్‌లో పాల్గొనడానికి నేను సంతోషిస్తున్నాను' అని మాజీ క్రికెటర్ కుమార సంగక్కర చెప్పాడు.

**మ్యాచ్‌లు ఎక్కడ జరగనున్నాయి?**

IML మ్యాచ్‌లకు భారత్‌లోని మూడు ప్రధాన నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. తొలి ఐదు మ్యాచ్‌లు నవీ ముంబయిలో షెడ్యూల్ చేశారు. ఆ తర్వాతి మ్యాచ్‌లు రాజ్‌కోట్‌లో నిర్వహిస్తారు. సెమీస్ ఇంకా, ఫైనల్ మ్యాచ్‌లకు రాయ్‌పూర్ వేదిక కానుంది.

**లైవ్ ఎక్కడ చూడవచ్చు?**

అభిమానులు IML మ్యాచ్‌లను డిస్నీ+ హాట్‌స్టార్ (వయా జియోస్టార్), కలర్స్ సినీప్లెక్స్, కలర్స్ సినీప్లెక్స్ సూపర్‌హిట్స్ ద్వారా లైవ్ చూడవచ్చు. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతాయి.

## ఛాంపియన్స్ ట్రోఫీకి సర్వం సిద్ధం

ఛాంపియన్స్ ట్రోఫీ – 2025ను అనుకున్న ప్లాన్ ప్రకారమే నిర్వహిస్తాము. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కావల్సిన ఈ టోర్నీ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని పీసీబీ ఛైర్మన్ మోషిన్ నఖ్వీ స్పష్టం చేశారు. కరాచీలోని నేషనల్ స్టేడియంలో ఇంకా పనులు కొనసాగుతుండటంతో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై ఆందోళన నెలకొంది. పాకిస్తాన్ అధికారిక పత్రిక 'డాన్'లో కూడా టోర్నీ నిర్వహణపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కథనాన్ని ప్రచురించింది. నేషనల్ స్టేడియం రినోవేషన్ అనుకున్న సమయంలోగా పూర్తి చేయడం అసాధ్యమే అనిపిస్తోంది. కానీ దీనికి బాధ్యులైన వాళ్లు మాత్రం తప్పకుండా పూర్తి చేస్తామనే ధీమాగా ఉన్నారు. ఈ విషయంలో పీసీబీ జీరో అయినా కావొచ్చు.. హీరో అయినా కావొచ్చని ఆ కథనంలో పేర్కొంది. కాగా, మంగళవారం రావల్పిండి స్టేడియంను సందర్శించిన మోషిన్ నఖ్వీ.. టోర్నీ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని తెలిపారు. అయితే లాహోర్, కరాచి, రావల్పిండిలోని స్టేడియంలు అనుకున్న ప్రకారం జనవరి 31లోగా రినోవేషన్ పూర్తి చేసుకుంటాయనే విషయంలో ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు న్యూజిలాండ్, సౌతాఫ్రికా, పాకిస్తాన్తో నాలుగు మ్యాచ్ల ట్రై సిరీస్ ఫిబ్రవరి 8 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. మొదటి రెండు మ్యాచ్లకు లాహోర్, తర్వాతి రెండు మ్యాచ్లకు కరాచీ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అయితే అప్పటిలోగా ఈ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయిలో రినోవేట్ అవుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నాయి.

# 'కూల్ కాదు.. వెరీ హాట్': ధోనీ

- 'డీఆర్ఎస్' ఛాంపియన్స్ ట్రోఫీ ప్రోమో వైరల్

మహేంద్ర సింగ్ ధోనీ.. బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా, కెప్టెన్‌గా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. క్యాచ్‌లు పట్టుకోవడం, వేగంగా స్టంపింగ్‌లు చేయడం, రనౌట్లు చేయడం, ఎల్బీడబ్ల్యూలు కచ్చితంగా అంచనా వేయడంలో మహీకి సాటి ఎవరూ రారనే చెప్పాలి. అసలు ధోనీ రివ్యూ తీసుకున్నాడంటే అది కచ్చితంగా ఔట్ అనే అందరూ ఫిక్సైపోతారు. ఈ డీఆర్ఎస్ (డెసిషన్ రివ్యూ సిస్టమ్)ను ధోనీ రివ్యూ సిస్టమ్ అని కూడా క్రికెట్ ఫ్యాన్స్ ట్రెండ్ కూడా చేస్తూ ఉంటారు. అయితే ఈ సారి ధోనీ రిఫ్రిజిరేషన్ సిస్టమ్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. అందుకు కారణం ఛాంపియన్స్ ట్రోఫీ.



ఛాంపియన్స్ ట్రోఫీ దగ్గర పడుతోన్న నేపథ్యంలో ధోనీతో రూపొందించిన ప్రోమోను విడుదల చేశారు. ఇప్పుడా ప్రోమో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోలో మహీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కెప్టెన్‌గా తానెప్పుడూ కూల్‌గానే ఉన్నానని చెప్పిన అతడు.. ఇప్పుడు ఓ క్రికెట్ అభిమానిగా ఛాంపియన్స్ ట్రోఫీని కూల్ గా చూడలేనని అన్నాడు.

ఎందుకంటే ఒక్క మ్యాచ్ ఓడినా కూడా అంతే సంగతులు. చాలా హాట్‌గా అనిపిస్తోంది అని పేర్కొన్నాడు. దీని కోసం డీఆర్ఎస్ (ధోనీ రిఫ్రిజిరేషన్ సిస్టమ్)ను రెడీ చేసినా అస్సలు సరిపోవట్లేదని చెప్పుకొచ్చాడు. అలా ధోనీ కామెంట్స్, విజువల్స్ తో ప్రోమో ఆద్యాంతం ఆసక్తిగా సాగింది.

"నేను కెప్టెన్‌గా కూల్ గా ఉన్నా. కానీ, అభిమానిగా ఈ ట్రోఫీని చూడబోతుండటం చాలా హాట్ గా అనిపిస్తోంది. మనం ఒక్క మ్యాచ్ ఓడినా కూడా అంతే సంగతులు. ఈ టెన్షన్ వల్ల నా బుర్ర హీట్ ఎక్కేస్తోంది. " అని వీడియోలో ధోనీ అంటాడు. ఐస్ గడ్డలతో తయారుచేసిన డ్రెస్, టోపీని ధరించి ఈ కామెంట్స్ చేస్తాడు. అనంతరం ట్యాంకర్లతో ఐస్‌ను తీసుకొచ్చి డంప్ చేసినా హీట్ తగ్గడం లేదంటూ కామెడీ ఎక్స్ ప్రెషన్స్ పెడతాడు. ఫైనల్ గా.. ధోనీ రిఫ్రిజిరేషన్ సిస్టమ్ కావాలని థర్డ్ అంపైర్‌కు సూచిస్తాడు. దీంతో తనను పూర్తిగా ఐస్ గడ్డలతో ముంచేసినా కూడా హీట్ మాత్రం తగ్గట్లేదని చెబుతూ ప్రోమోను ముగించాడు.

అండర్-19 మహిళల టీ20..

# ఆస్ట్రేలియాకు షాకిచ్చిన శ్రీలంక

### 12 పరుగుల తేడాతో ఆసీస్‌పై ఘన విజయం

ఐసీసీ అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్ 2025 ఆసక్తికరంగా సాగుతోంది. తాజాగా ఆఖరి సూపర్ సిక్స్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టుకు లంక షాకిచ్చింది. ఈ మెగా టోర్నీలో విజయాలతో దూసుకెళ్తోన్న ఆసీస్‌ను శ్రీలంక ఓడించింది. 12 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే ఈ విజయం సాధించినప్పటికీ లంక జట్టుకు సెమీస్ అదృష్టం కలుగలేదు. మరోవైపు ఓటమిని అందుకున్నప్పటికీ ఇప్పటికే ఆసీస్ సెమీస్ బెర్త్ ను ఖరారు చేసేసుకుంది.




మ్యాచ్ విషయానికొస్తే టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన లంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. లంక ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సంజన కవిండి (19), సుముదు నిసంసల (18) టాప్ స్కోరర్. ఆసీస్ బౌలర్లలో లిల్లీ బాస్సింగ్‌వైత్ 3 వికెట్లు తీయగా.. హస్రత్ గిల్, టెగాన్ విలియమ్సన్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో లంక బౌలర్లు చెలరేగారు. దీంతో ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 87 పరుగులే చేసింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో బ్రే (27) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిగతా వారు నామమాత్రపు పరుగులు చేయడానికి కూడా ఇబ్బంది పడ్డారు.

లంకకు తప్పని నిరాశ – సెమీ ఫైనల్ ఎప్పుడంటే

గ్రూప్ స్టేజ్ లో లంక జట్టు.. మలేసియా, విండీస్ జట్లపై విజయాలను అందుకున్నప్పటికీ భారత్ చేతిలో దారుణంగా ఓడిపోయింది. దీంతో సెమీస్ అవకాశాలను క్లిష్టంగా మారాయి. ఆ తర్వాత కూడా సూపర్-6లో జరిగిన మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడంతో రద్దైంది. ఫలితంగా లంక సెమీస్ ఆశలు గల్లంతయ్యాయి. దీంతో గ్రూప్-1 నుంచి భారత్, ఆస్ట్రేలియా సెమీస్ కు అర్హత సాధించాయి. గ్రూప్-2 నుంచి సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ సెమీకు ఎంటర్ అయ్యాయి. జనవరి 31తొలి సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా – సౌతాఫ్రికా తలపడనున్నాయి. రెండో సెమీ ఫైనల్‌లో భారత్ – ఇంగ్లాండ్ పోటీ పడనున్నాయి.




# చెప్తా.. తొందరెందుకు?



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న భారీ ప్రాజెక్టు ఎస్ఎస్ఎంబి 29. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో ప్రతి నాయకుడిగా కనిపించనున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పష్టతనిచ్చారు.

"నాకంటే మీకే చాలా విషయాలు తెలిశాయి. ఇంకా ఏదీ స్పష్టత రాలేదు. చర్చలు జరుగుతున్నాయి. అవి ఫైనల్ అయ్యాక దీని గురించి మాట్లాడుకుందాం" అన్నారు. అనంతరం 'సలార్ 2' గురించి మాట్లాడారు. "సలార్ 2 తప్పకుండా చేస్తాం. ఎన్టీఆర్‌తో ప్రశాంత్ నీల్ ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆ సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయ్యాక 'సలార్ 2' మొదలవుతుంది" అని చెప్పారు. 'సలార్' వల్ల ప్రభాస్ నుంచి తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానన్నారు. "ప్రభాస్‌కు ఉన్న స్టార్డమ్ ఆయనకు తెలియదు. నాకు తెలిసినంత వరకూ ఆయన సోషల్మీడియా కూడా ఉపయోగించరు. ప్రైవేట్ పర్సన్. అత్యంత సన్నిహితులతోనే అన్ని విషయాలు పంచుకుంటారు" అని తెలిపారు.

భారీ బడ్జెట్తో ఎస్ఎస్ఎంబి 29 రూపొందుతోంది. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కెఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ప్రపంచాన్ని చుట్టేసే ఓ సాహస ప్రయాణంగా, అటవీ నేపథ్యంలో సాగే కథతో చిత్రం రూపొందుతోంది. గతేడాది చివర్లో ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగింది. ప్రియాంక చోప్రా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి ఎలాంటి లీక్‌లు లేకుండా చిత్రబృందం పలు జాగ్రత్తలు తీసుకుంటుంది.

## కార్తీకి జోడీగా..


కోలీవుడ్ సహా తెలుగులో కూడా మంచి ఫేమ్ ఉన్న తమిళ హీరోస్‌లో వెర్సటైల్ హీరో కార్తీ ఒకరు. కార్తీ హీరోగా నటించిన చిత్రాల్లో "ఖైదీ" సినిమాకి ప్రత్యేక స్థానమే ఉంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్‌కి కూడా ఒక బ్రేక్ ఇచ్చిన సినిమా ఇదే కాగా తన కెరీర్లో ఎన్ని సినిమాలు వస్తున్నప్పటికీ ఖైదీ సీక్వెల్‌పై మాత్రం నెక్స్ట్ లెవెల్ అంచనాలు ఉన్నాయి. అందుకే ఈ సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సీక్వెల్ పై ఇపుడు లేటెస్ట్ బజ్ ఒకటి వినిపిస్తుంది. ఇందులో మలయాళ బ్యూటీ రజిష విజయన్ కార్తీ సరసన ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనుందంటూ రూమర్స్ వినిపిస్తున్నాయి. సూర్య లీడ్‌రోల్‌గా చేసిన 'జైభీమ్' చిత్రంలో కీలక పాత్ర చేసి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రజిష.. అటు మలయాళంలో మంచి పేరే తెచ్చుకుంది. ఇప్పుడు తమ్ముడు కార్తి సరసన ప్రాత చేయనుందన్న కథనంలో ఎంతమేర నిజముందనేది మేకర్సే కన్ఫర్మ్ చేయాలి. ప్రస్తుతం లోకేష్ రజినీకాంత్‌తో "కూలీ" సినిమాలో బిజీగా ఉండగా ఈ సినిమా తర్వాత ఖైదీ -2 స్టార్ట్ చేయనున్నాడు. హీరో కార్తి సైతం రెండు మూడు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

## అదే పెద్ద ఆనందం..



నటుడు మాధవన్ తనయుడు వేదాంత్ స్విమ్మింగ్ పోటీల్లో రికార్డులు సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. మలేసియన్ ఓపెన్‌లో పాల్గొని గోల్డ్ మెడల్స్ అందుకున్నాడు.. తనయుడి విషయంలో తాను ఎంతో గర్వంగా ఉన్నట్టు మాధవన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "బయటవాళ్లు ఎవరైనా నన్ను కలిసినప్పుడు మీ వర్క్ మాకెంతో నచ్చిందని చెబితే.. ఆనందమే. కానీ, వేదాంత్ విషయంలో మిమ్మల్ని చూస్తుంటే మాకెంతో గర్వంగా అందని అంటున్నప్పుడు ఇంకా సంతోషం' అన్నారు. "దురదృష్టమో, అదృష్టమో నువ్వు నా కుమారుడిగా ఉండటం వల్ల సమాజంలో నీకొక గుర్తింపు వచ్చింది. నువ్వు చిన్న తప్పు చేసినా నేషనల్ న్యూస్ అయిపోతుంది. గుర్తుపెట్టుకో. నీ తోటి వాళ్ల మాదిరిగా నువ్వు సరదాగా ప్రయాణించలేవు. ఇష్టమైన కొన్ని పనులు చేయలేవు. కానీ తప్పుదు ఈ భారాన్ని నువ్వు మోయాల్సి ఉంటుందని చెబుతుంటా" అని మాధవన్ తెలిపారు.

## తళుక్కుమన్న తమన్నా



మిల్కీ బ్యూటీ తమన్నా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి చాలా ఏళ్లయ్యింది. కానీ ఇప్పటివరకు తన రిలేషన్‌షిప్ గురించి పెద్దగా రూమర్స్ రాలేదు. అలాంటి తమన్నా.. అప్‌కమింగ్ యాక్టర్ విజయ్‌వర్మతో ప్రేమలో పడి అందరినీ ఆశ్చర్యపరిచింది. నటుడిగా విజయ్ వర్మకు అనుభవం చాలా తక్కువ. వీరిద్దరూ కలిసి 'లస్ట్ స్టోరీస్ 2' అనే వెబ్ ఫిల్మ్‌లో నటించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలోనే ప్రేమలో పడ్డారు. 2023 జూన్‌లో తమ ప్రేమ విషయాన్ని ఓపెన్‌గా అనౌన్స్ చేసేసింది తమన్నా. అప్పటినుండి అంతా సాఫీగా సాగిపోతున్నా తాజాగా తమన్నా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ చూస్తుంటే ప్రేక్షకుల్లో అనుమానాలు మొదలయ్యాయి. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం తమన్నా హీరోయిన్‌గా కంటే గెస్ట్ రోల్స్, ఐటెమ్ సాంగ్స్‌లోనే ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల బాలీవుడ్ మూవీ 'స్త్రీ 2'లో తమన్నా చేసిన 'ఆజ్ కీ రాత్' అనే పాట బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యింది. మరోసారి తను ఫామ్ కోల్పోలేదు అని ప్రేక్షకులకు నిరూపించేలా చేసింది.



## ఈసారి కామెడీ థ్రిల్లర్‌తో..

మెగా యంగ్ హీరో వరుణ్ తేజ్ హీరోగా ఎప్పటికప్పుడు కొత్త సబ్జెక్టులని అందించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. రీసెంట్‌గానే "మట్కా" సినిమాలో కూడా పలు వేరియేషన్స్‌లో సహా నటుడిగా కూడా మెప్పించాడు. అయితే ఈ సినిమా తర్వాత తన నుంచి మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌ని అనౌన్స్ చేసాడు. ఈసారి ఇండో -కొరియన్ కామెడీ థ్రిల్లర్‌ని దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో అలరించేందుకు వస్తున్నాడు. అయితే ఈ సినిమాపై మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్‌ని ఇపుడు అందించారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ సినిమా యూనిట్ వియాత్నంలో లొకేషన్ వేటలో ఉన్నట్టుగా తెలిపారు. అలాగే మార్చ్‌నుంచి సినిమా షూటింగ్‌ని స్టార్ట్ చేస్తున్నట్టుగా కూడా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. మరి ఈ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా యూవీ క్రియేషన్స్ నిర్మాణం వహిస్తున్నారు.



## రూటుమార్చిన వరలక్ష్మి

టాలీవుడ్ సహా తమిళ్ సినిమాలో లేడీ విలన్ పాత్రలకి గుర్తొచ్చే పేరు ఏదన్నా ఉందంటే డెఫినెట్‌గా అది వెర్సటైల్ నటి వరలక్ష్మి శరత్ కుమార్‌దే. ఐటీ సినిమా తర్వాత ఆమె మరో థ్రిల్లర్‌కి ఓకే చెప్పినట్టు తెలుస్తుంది. 'ఆదిపర్వం' మూవీ డైరెక్టర్ సంజీవ్ మేగోటి రాసుకున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ సబ్జెక్టుకు వరలక్ష్మి శరత్ కుమార్ ఓకే చెప్పినట్టు సమాచారం. ఇందులో వరలక్ష్మి శరత్ కుమార్ మెయిన్ లీడ్ పాత్ర చేయనుందట. భారీ బడ్జెట్‌తో డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులూ ఉంటారని ఇండ్రస్టీ టాక్. పూర్తి వివరాలు అతి త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు. ఈ చిత్రంతో వరలక్ష్మి శరత్ కుమార్ ఎలాంటి ఇమేజ్ సొంతం చేసుకుంటుందో చూడాలి.